

పెండింగ్‌లో ఫినిషింగ్ పనులు

● వెంకటగిరి పట్టణంలో 1824 టిడ్కో ఇళ్ళు మంజూరయ్యాయి. అందులో 1156 ఇళ్ళను పూర్తి చేసి ఈ ఏడాది జనవరిలో లబ్ధిదారులకు కేటాయించారు. ప్రస్తుతం లబ్ధిదారులు ఆ ఇళ్ళలోనే నివాసముంటున్నారు. మిగిలిన 668 ఇళ్ళకు సంబంధించిన నిర్మాణ పనులు వివిధ దశల్లో వున్నాయి. కొన్ని పునాదుల వద్ద, మరికొన్ని పూర్తయి ఫినిషింగ్ పనులు పెండింగులో వున్నాయి. లబ్ధిదారులు నివాసముంటున్న భవనాల వద్ద కనీసం రోడ్డు సదుపాయం గానీ, పారిశుధ్య నిర్వహణ గానీ చేపట్టడం లేదు. అధ్వానకర పరిస్థితుల నడుమ లబ్ధిదారులు నివాసముంటున్నారు.

పునాదుల వద్దే ఆగిపోయిన నిర్మాణాలు



నిర్వహణ లేక అధ్వానంగా వున్న ఇళ్ళు



గూడూరులో ఇళ్ల నడుమ పిచ్చిమొక్కలు

టిడ్కో ఇళ్ళకు

జగన్ గ్రహణం

●తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని లబ్ధిదారులకు ఏర్పేడు మండలం వికృతమాల వద్ద 1800 టిడ్కో ఇళ్ళు నిర్మాణమయ్యాయి. 2018లోనే లబ్ధిదారులకు కేటాయించినా అప్పట్లో లబ్ధిదారులు నివాసం వుండడానికి రాలేదు. 2019 ఆగస్టులో ఇళ్ళను స్వాధీనం చేసుకుని కాపురాలు వచ్చినా మౌలిక సదుపాయాలు లేక తిరిగి తిరుపతికి వెళ్ళిపోయారు. ప్రస్తుతం 300 కుటుంబాలు మాత్రమే నివాసముంటున్నాయి. పారిశుధ్య నిర్వహణ లేదు. తాగునీటి పైపు లైను మరమ్మతులకు గురైంది.లబ్ధిదారులు చందాలు వేసుకుని నిర్వహణ పనులు చేసుకుంటున్నారు. బస్సు సదుపాయం లేదు. సాయంత్రమైతే గంజాయి, మందుబాబులు ఖాళీగా వున్న సముదాయాల్లోకి చేరుకుని భయానక వాతావరణం సృష్టిస్తున్నారు.



నిర్వహణ లేని డ్రైనేజీ కాలువ



మరమ్మతులకు గురైన తాగునీటి పైపులైన్



లబ్ధిదారులు నివాసం లేక ఇళ్ళలో ఊడిపోయిన తలుపులు

తిరుపతి, మే 9 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబుపై కక్షతో ఆయన హయాంలో శ్రీకారం చుట్టిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం పాడుపెట్టింది.పట్టణ పేదలకు పక్కా ఇళ్లు అందించాలన్న లక్ష్యంతో గత తెలుగుదేశం ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారు.జగన్ సర్కారు వచ్చాక మిగిలినవాటికి గ్రహణం పట్టింది. ఎక్కడి నిర్మాణాలను అక్కడ ఆపేసింది. 90 శాతం పనులు జరిగిన నిర్మాణాలను కూడా పూర్తి చేయకుండా గాలికి వదిలేసింది. దీంతో చాలా చోట్ల టిడ్కో ఇళ్ల సముదాయాలు ముళ్ల చెట్ల పొదలతో నిండిపోయాయి.తిరుపతి కార్పొరేషన్, వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట, నాయుడుపేట, శ్రీకాళహస్తి, పుత్తూరు పట్టణాల్లో ఎక్కడా పూర్తిస్థాయిలో టిడ్కో ఇళ్ళ నిర్మాణం పూర్తి కాలేదు. ఒకటి రెండు చోట్ల దాదాపు పూర్తయినా లబ్ధిదారులకు ఇళ్ళు కేటాయించలేదు. అరకొరగా కాపురాలకు చేరిన లబ్ధిదారులు సైతం మౌలిక సదుపాయాలు లేక ఇళ్ళు ఖాళీ చేస్తున్నారు.

●గూడూరులో 5120 టిడ్కో గృహాలు నిర్మించగా వాటిలో 2800 గృహాలను మాత్రమే లబ్ధిదారులకు స్వాధీనం చేశారు. అయితే టిడ్కో ఇళ్ళ సముదాయాలకు తాగునీటి సరఫరా లేదు. ట్యాంకర్లు వచ్చినపుడు నీరు పట్టుకోవాల్సి వస్తోంది. పారిశుధ్య నిర్వహణ కూడా లేదు. భవనాల నడుమ పిచ్చిమొక్కలు పెరిగిపోయి అడవిని తలపిస్తున్నాయి. విషసర్పాల బెడద కూడా అధికంగా వుంది. దీంతో 2800 కుటుంబాల్లో 1200కుటుంబాలు టిడ్కో ఇళ్ళను విడిచిపెట్టి వెళ్ళిపోయాయి. ఇపుడు 1600 కుటుంబాలు మాత్రమే సమస్యలతో సహవాసం చేస్తూ అగచాట్లు పడుతున్నాయి. నివాసం లేని మిగిలిన ఇళ్ళు నిర్వహణ లేక తలుపులకు చెదలుపట్టి ఊడిపోతున్నాయి.

ట్యాంకరు నుంచీ నీరు పట్టుకుంటున్న లబ్ధిదారులు →



●నాయుడుపేట పట్టణంలో 2064 టిడ్కో ఇళ్ళు నిర్మాణమయ్యాయి. 60 శాతం ఇళ్ళ నిర్మాణం పూర్తయింది. టైల్స్, విద్యుదీకరణ, ప్లంబింగ్, తాగునీటి పైప్‌లైన్ పనులు, అంతర్గత రోడ్లు, డ్రైయినేజీ పనులు పెండింగులో వున్నాయి. ఇళ్ళు ఎవరికీ ఇంకా కేటాయించలేదు.

●సూళ్ళూరుపేట పట్టణంలో 1632 టిడ్కో ఇళ్ళు నిర్మిస్తున్నారు. 70 శాతం పనులు పూర్తయ్యాయి. లబ్ధిదారులకు ఇంకా కేటాయించలేదు. కొన్ని బ్లాకులు పునాదుల వద్దే ఆగిపోయాయి.

●శ్రీకాళహస్తి పట్టణంలో 6109 టిడ్కో ఇళ్ళు నిర్మాణమయ్యాయి. కానీ లబ్ధిదారులకు కేటాయించలేదు. ఇళ్ళన్నీ నిర్వహణ లేక దెబ్బ తింటున్నాయి. తలుపులు, కిటికీలు దెబ్బతిన్నాయి.

లబ్ధిదారులకు కేటాయించని ఇళ్ళ దుస్థితి →



20వేల ఓటరు స్లిప్పుల గల్లంతు?

● విచారణకు ఆదేశించిన కలెక్టర్

తిరుపతి(నేరవిభాగం), మే 9 : తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన 20వేల ఓటరు స్లిప్పులు గురువారం గల్లంతైనట్లు సమాచారం.తిరుపతి ఎన్నికల రిటర్నింగ్ అధికారి అదితిసింగ్ ఈ విషయాన్ని జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో అంతర్గత విచారణకు ఆదేశించారు. ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం బుధవారం ముగిసింది.పంపిణీ కాకుండా మిగిలిన ఓటరు స్లిప్పులను రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో బీఎల్వోలు సమర్పించాలి. ఇలా సమర్పించిన 60 వేల ఓటరు స్లిప్పుల్లో 20వేల దాకా గల్లంతైనట్లు తెలియడంతో అప్రమత్తమైన రిటర్నింగ్ అధికారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు.ఈ విషయమై తిరుపతి అర్బన్ తహసీల్దార్ నారాయణరెడ్డిని వివరణ కోరగా 20 వేల ఓటరు స్లిప్పులు గల్లంతు కాలేదని, ఓ బీఎల్వో వద్ద వున్న 70 ఓటరు స్లిప్పులను గుర్తు తెలియని వ్యక్తులు బయట పారేశారన్నారు.వాటిని తిరిగి తెచ్చి భద్రపరిచారన్నారు.

56వేల ఓటర్ స్లిప్పులను బయటపెట్టాలి

ఆరణి శ్రీనివాసులు డిమాండ్

తిరుపతి, మే 9 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో పంపిణీ చేయకుండా వెనక్కి వచ్చిన 56వేల ఓటర్ స్లిప్పులను వెంటనే బహిర్గతం చేయాలని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మార్చినెలలో ప్రస్తుత ఆర్వోనే కార్పొరేషన్ కమిషనర్‌గా, ఇదే బీఎల్వోలు పనిచేశారని గుర్తుచేశారు. కేవలం వైసీపీకి అధికారులు కొమ్ముకాయడం వల్లే 56వేల ఓటర్ స్లిప్పులు వెనక్కి వచ్చాయని మండిపడ్డారు. వెనక్కి వచ్చినవన్నీ దొంగ ఓటర్లవేనని, ఆ లిస్టును బహిరంగ పరచాలని కోరారు. ఎన్నికల సంఘం ఫిబ్రవరి, మార్చిలోపు దొంగ ఓట్ల తొలగింపునకు అవకాశం ఇచ్చినా అధికారులు ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. దేశంలోనే 16 అత్యంత సమస్యాత్మక నియోజకవర్గాల్లో ఒకటిగా ఉన్న తిరుపతిలో గత ఎన్నికల్లోనే 174 పోలింగ్ కేంద్రాల్లో బలగాలను నియమిస్తే, ప్రస్తుతం కేవలం 40 కేంద్రాల్లోనే బలగాలను ఏర్పాటు చేయడం వైసీపీకి మేలు చేయడానికేనని ఆరోపించారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు స్పందించి, తిరుపతిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలను మొహరింపజేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు పుత్తూరుకు జగన్

పుత్తూరు అర్బన్, మే 9: సీఎం జగన్ శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు పుత్తూరులో నిర్వహించనున్న ఎన్నికల ప్రచార సభకు హాజరు కానున్నారు. పట్టణంలోని కాపువీధి జంక్షన్ వద్ద సభ జరిగే ప్రదేశాన్ని ఎస్పీ విక్రమ్ పాటిల్ గురువారం పరిశీలించి పలు సూచనలు చేశారు.ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద జగన్ దిగేందుకు వీలుగా హెలిప్యాడ్ నిర్మిస్తున్నారు.జగన్ సభ విజయవంతం చేసేందుకు నగరి నుంచే కాకుండా సత్యవేడు, జీడీ నెల్లూరు నియోజకవర్గాల నుంచి కూడా వైసీపీ నేతలు జనసమీకరణ చేస్తున్నట్లు తెలిసింది.

రేపు చిత్తూరులో చంద్రబాబు సభ

చిత్తూరు సిటీ, మే 9: చిత్తూరులో శనివారం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఎన్నికల ప్రచార సభ ఉంటుందని ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు మెసానికల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఈ సభ ఏర్పాట్లను ఆ పార్టీ నేతలు పర్యవేక్షిస్తున్నారు.

ముగిసిన పోస్టల్ బ్యాలెట్

● ఓటు హక్కు వినియోగించుకున్న 17,774 మంది ఓటర్లు

తిరుపతి(కలెక్టరేట్), మే 9: ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, అత్యవసర సేవల్లో ఉన్నవారు గడిచిన ఐదు రోజులకుగాను 17,774మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం 17,867మంది దరఖాస్తు చేసుకోగా 17,774మంది వినియోగించడంతో 99.45శాతం ఓటింగ్ నమోదైనట్లు జిల్లా అధికారులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం వరకు ఏడు నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ కొనసాగింది. చివరి రోజున 249మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగి జిల్లాలో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న 5,458మందికిగాను 4,352మంది గురువారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. హోం ఓటింగ్ రెండ్రోజుల కిందట వరకు 1,077 ఓటు హక్కు వినియోగించుకున్నారు. 85ఏళ్లు దాటి వృద్ధులు, పోలింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు వినియోగించుకునేందుకు ఈనెల 12వ తేదీ గడువు పొడిగించినట్లు జిల్లా అధికారులు తెలిపారు.

ఆర్.కృష్ణయ్యపై రాయితో దాడి

● వీపుపై తగిలి కమిలిన చర్మం



రాయిని చూపిస్తున్న కృష్ణయ్య (ఇన్‌సెట్‌లో) కమిలిన చర్మం

ఏర్పేడు, మే 9 : బీసీ నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యపై గుర్తు తెలియని వ్యక్తి రాయి విసిరిన ఘటన ఏర్పేడులో గురువారం రాత్రి జరిగింది.వైసీపీ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. రోడ్‌షోలో భాగంగా వాహనంపై నించుని ప్రసంగిస్తుండగా వెనుకవైపు నుంచీ చీకట్లో గుర్తు తెలియని వ్యక్తి విసిరిన రాయి కృష్ణయ్యకు వీపుపై తాకి స్వల్పంగా కమిలింది. దీంతో కృష్ణయ్య తనకు తగిలిన రాయిని ప్రజలకు చూపిస్తూ ప్రజల కోసమే పుట్టిన తనపై దాడి సమంజసం కాదని, ఇది పిరికిపంద చర్య అని అన్నారు.అనంతరం ప్రచారం ముగించి శ్రీకాళహస్తి వెళ్ళారు. ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాక అక్కడే మీడియా సమావేశంలో మాట్లాడారు.ఇది తనపై జరిగిన దాడి కాదని,బీసీలపై జరిగిన దాడి అని కృష్ణయ్య పేర్కొన్నారు.ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి మాట్లాడుతూ కృష్ణయ్యకు తగిలిన రాయి తర్వాత తన పొట్టకు తగిలిందన్నారు.ఇదంతా టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి పనే అని ఆయన ఆరోపించారు.అయితే బీసీలను రెచ్చగొట్టేందుకు వైసీపీ నేతలు కావాలనే కుట్రపూరితంగా రాయి దాడి డ్రామా ఆడించారని టీడీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు.



మద్యం దుకాణాలు కిటకిట

పాకాల, మే 9 : ఎన్నికల నేపధ్యంలో మద్యం దుకాణాలు మందుబాబులతో కిటకిటలాడుతున్నాయి. పాకాల మండలంలో ఉదయం దుకాణం తెరవక ముందే మద్యం కొనుగోలుకు దుకాణాల ముందు పడిగాపులు పడుతున్నారు. ఉదయం 11 గంటలకు విక్రయాలు ప్రారంభించి రెండు మూడు గంటల్లోనే టార్గెట్ అమ్మకాలు పూర్తి కావడంతో సిబ్బంది దుకాణాలు మూసేస్తున్నారు. దీంతో బ్లాక్‌లో అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. మద్యానికి ఏర్పడిన డిమాండుతో ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది కొంతమంది అధిక ధరలకు బ్లాక్‌లో విక్రయించి దండుకుంటున్నారు.ఓ కేస్ మద్యానికి 500-1000రూపాయల వరకు అధిక ధరకు అమ్ముకుంటున్నారు.పోలింగు తేదీ దగ్గరపడుతుండడంతో రాజకీయ నాయకులు ఓటుకు క్వార్టర్ బాటిల్‌తో పాటు కేజీ చికెన్ పంపిణీ చేస్తుండడంతో చికెన్ దుకాణాల్లో కోళ్లు ఖాళీ అయిపోతున్నాయి.

మద్యం... వైసీపీపరం

పుత్తూరు అర్బన్, మే 9: నగరి నియోజకవర్గ పరిధిలోని మద్యం దుకాణాలు స్టాక్ లేక బోసిపోతున్నాయి.కొన్నిచోట్ల మద్యం షాపుల్లో పనిచేసే సిబ్బందిని లోబర్చుకున్న అధికార పార్టీ నాయకులు దుకాణం తెరిచిన వెంటనే స్టాక్ తీసుకెళ్లిపోతున్నారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా గతేడాది ఇదేరోజు సాగించిన విక్రయాలకు సమానమైన మద్యాన్ని మాత్రమే దుకాణాల్లో విక్రయించాలి.ఎన్నికల సీజన్ కావడంతో మద్యానికి విపరీతమైన డిమాండ్ నెలకొంది. గత ఏడాది విక్రయాల ఆధారంగానే స్టాక్ సరఫరా చేస్తుండడం, వైసీపీ నేతల హస్తలాఘవంతో మద్యం దుకాణాలు తెరిచిన వెంటనే మూతపడుతున్నాయి.

చీప్ లిక్కర్‌కు డిమాండ్

● స్టాకు లేక వెలవెలబోతున్న దుకాణాలు

తిరుపతి(నేరవిభాగం), మే 9: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు మూడ్రోజులే సమయం ఉండటంతో మద్యం దుకాణాలు కళకళలాడుతున్నాయి. ప్రధానంగా చీప్ లిక్కర్ కోసం మందుబాబులు ఎగబడుతున్నారు. జిల్లాలోని రెండు ఎక్సైజ్ డివిజన్ల పరిధిలో దాదాపు 253 మద్యం షాపులున్నాయి. వీటి ద్వారా రోజుకు రూ.3.5 లక్షల వరకు వ్యాపారం జరుగుతోంది. ప్రస్తుతం చీప్ లిక్కర్ బ్రాండ్లు ఉన్న షాపులు మాత్రం కిటకిటలాడుతున్నాయి.మరోవైపు తిరుపతితోపాటు నాయుడుపేట, గూడూరు, శ్రీకాళహస్తి, సత్యవేడు తదితర ప్రాంతాల్లో అవసరమైన బ్రాండెడ్ మద్యం లేకపోవడం, స్టాకులో కోత ఉండటంతో చాలాచోట్ల దుకాణాలు వెలవెలపోతున్నాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే తిరుపతిలోని సత్యనారాయణపురం, దేవేంద్ర థియేటర్ రోడ్డు, శ్మశానం సర్కిల్, రాజీవ్ గాంధీ కాలనీ, జీవకోన, డీబీఆర్ రోడ్డు వద్ద ఉన్న దుకాణాల్లో స్టాకు లేక గురువారం మధ్యాహ్నం 11గంటలనుంచే బోసిపోయాయి. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు తిరుపతిలోని మొత్తం దుకాణాల్లో కేవలం రూ.లక్ష వ్యాపారం కూడా జరగలేదని తెలిసింది.

మూడ్రోజుల సెలవుతో సప్లై కంట్రోల్ చేశాం

ఎన్నికల ఆంక్షలు ఉండడంతో ఈనెల 11 సాయంత్రం 5 గంటల నుంచి 13 సాయంత్రం 5 గంటల వరకు జిల్లాలోని అన్ని బార్లు, ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసి వేస్తున్నాం. దీంతోపాటు షాపులన్నీ తాత్కాలిక భవనాల్లో ఉండటం వల్ల ఎన్నికల్లో అనుకోని ఘటనలు జరిగితే ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే సప్లై కంట్రోల్ చేశాం. గత ఏడాది మేలో విక్రయించిన స్టాకు కంటే 10 శాతానికి మించి విక్రయాలు జరగకూడదన్న ఆంక్షలతో దుకాణాల్లో స్టాకు అయిపోయి, వెలవెల పోతున్నాయి.

- జానకిరాం,ఎక్సైజ్ సూపరింటెండెంట్

చంద్రగిరి

గంజాయి, రౌడీయిజాన్ని రూపుమాపుతా

వెంకటపతినగర్‌లో పులివర్తి నాని



తిరుపతి రూరల్, మే 9: అధికార వైసీపీ పాలనలో తిరుపతి రూరల్ మండలంలోని వెంకటపతినగర్‌లో గంజాయి, రౌడీయిజం ఎక్కువయ్యాయని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అవుట్‌పోస్ట్ ఏర్పాటుచేసి రూపుమాపుతానని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పేర్కొన్నారు. గురువారం వెంకటపతినగర్‌లో పర్యటించిన నాని అక్కడ నిర్వహించిన బహిరంగసభలో మాట్లాడారు. చెవిరెడ్డిని ఇమిటేట్ చేస్తూ ప్రజలను అలరించారు. టీడీపీ నేతలు ఈశ్వర్‌రెడ్డి, బడి సుధాయాదవ్, శ్రీధర్ నాయుడు, నాయకులు పాల్గొన్నారు.



చిగురువాడలో...

తిరుపతి రూరల్ మండలంలోని చిగురువాడలో గురువారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. నానీకి టీడీపీ, జనసేన, బీజేపీనేతలు ఘన స్వాగతం పలికి పూలమాలతో సత్కరించారు.



పేరూరులో...

పేరూరు పంచాయతీల్లో టీడీపీలోకి వలసలు జోరందుకున్నాయి. జనార్ధన్‌కాలనీకి చెందిన పలువురు వైసీపీకి నేతలు టీడీపీ పేరూరు పంచాయతీ అధ్యక్షుడు శ్రీనివాసులు నేతృత్వంలో గురువారం ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరినవారిలో రుద్ర, బాల, రవి, మాజీవార్డు సభ్యుడు గోవిందు, శంకరాచారి, సెల్వాఆచారి, శ్రీలేఖ, మహాలక్ష్మి, సుశీలమ్మ, కావ్య, కీర్తి తదితరులున్నారు. రూరల్ మండల టీడీపీఅధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిక

పెరుమాళ్లపల్లె పంచాయతీ పరిధిలోని లక్ష్మీచెరువుగ్రామానికి చెందిన పలువురు వైసీపీనేతలు గురువారం టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన బాలు, దుర్గ, సాయికుమార్, గణేష్, మణి, తిరుమల, బాలాజి, రాజా, అజిత్, లోకేష్, సుబ్రమణ్యం, శంకర,శివ, యుగంధర్, సతీష్ తదితరులకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, కత్తి సుధా, ఎంపీటీసీ సోమశేఖర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



టీడీపీకి ఓటేయండి

ఏపీలో ప్రజాప్రభుత్వ ఏర్పాటుకోసం ఈనెల 13న జరిగే ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓటు వేయాలని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ బిరుదాల భాస్కర్‌రెడ్డి, చిత్తూరు పార్లమెంటు టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ దొడ్ల కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలంలోని తుమ్మలగుంటలో గురువారం టీడీపీ ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నేతలు



తిరుచానూరు, మే 9: రఘునాథ్ రిసార్ట్స్‌లోని టీడీపీ కార్యాలయంలో పులివర్తి నాని సమక్షంలో నెరబైలు పంచాయతీ మాజీ సర్పంచ్ చంద్రారెడ్డితో పాటు పులిబోనుపల్లికు చెందిన రమణ, వెంకటయ్య, సిద్ధయ్య, శ్రీను తదితరులు గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి నాని పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

టీడీపీ పాలనలోనే బీసీల సంక్షేమం



మాట్లాడుతున్న వినుకొండ సుబ్రహ్మణ్యం

పాకాల, మే 9: బీసీల సంక్షేమం తెలుగుదేశం పార్టీ పాలనలోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వినుకొండ సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం ఉప్పరపల్లె పంచాయతీ నూరినేనివారిపల్లె నాయిబ్రాహ్మణ కాలనీలో ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీసీ నాయకులు కనకరాజ్, టీజే ప్రవీణ్, రంజిత్, నాయిబ్రాహ్మణ నాయకుడు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ కాలనీలో ఇంటింటా ప్రచారం



పాకాల, మే 9: స్థానిక బాలాజీ కాలనీలో మహిళలు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ అమలు చేయనున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ఎమ్మెల్యేగా పులివర్తి నాని, ఎంపీగా దగ్గుమళ్ల ప్రసాదరావులను గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

వైసీపీని నమ్మి మోసపోవద్దు



ప్రసంగిస్తున్న సుధారెడ్డి

మంగళం, మే 9: వైసీపీని నమ్మి మళ్లీ మోసపోవద్దని టీడీపీ మహిళా నేత సుధారెడ్డి పేర్కొన్నారు. గురువారం మంగళం పంచాయతీ పద్మావతినగర్‌లో స్థానికులతో సమావేశం అయ్యారు. వైసీపీ వారికి భయపడకుండా.. టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీకి సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా వైసీపీ నుంచి ఆకాష్, సునీతారెడ్డి తదితరులు సుధారెడ్డి సమక్షంలో పసుపు కండువా కప్పుకుని టీడీపీలో చేరారు. తిరుపతి రూరల్ మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు రామంజేరి మహేశ్వరి, ధర్మారెడ్డి, గోపి, ఈశ్వర్, లక్ష్మి, ధనమ్మ, ఎస్ఎస్ లక్ష్మి, శ్రీనివాస్ చౌదరి, రవి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పిడుగుపాటుకు ఆవు మృతి

భాకరాపేట, మే 9: చిన్నగొట్టిగల్లు మండలం చట్టేవారిపాళెం పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లె దళితవాడకు చెందిన కాకర్ల సుబ్రహ్మణ్యం ఇంటి పక్కన ఉన్న చింత చెట్టుపై గురువారం సాయంత్రం పిడుగు పడటంతో.. దాని కింద ఉన్న పాడి ఆవు మృతి చెందింది. అప్పు చేసి సుమారు రూ.60 వేలతో కొనుగోలు చేసిన ఆవు మృతి చెందడంతో ఉన్న జీవనాధారం పోయిందని బాధితుడు సుబ్రహ్మణ్యం విలపించాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరాడు.

నేటినుంచి రామానుజ అవతార ఉత్సవాలు

తిరుపతి(కల్చరల్), మే 9: భగవద్ రామానుజాచార్య అవతార మహోత్సవాలను శుక్రవారం ఈనెల 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక అన్నమాచార్య కళామందిరంలో నిర్వహించే ఈ ఉత్సవాల్లో ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 8.30 వరకు సాహిత్య, సంగీత సభలు జరుగుతాయి. తొలి రోజు మే 10న సాయంత్రం 5.30 గంటలకు తిరుమల పెద్ద జీయరు స్వామి, చినజీయరు స్వామి మంగళాశాసనంతో కార్యక్రమం మొదలవుతుంది. అనంతరం తిరుపతికి చెందిన ఆచార్య చక్రవర్తి రంగనాథన్.. రామానుజ వైభవంపై ప్రసంగిస్తారు.

ఎన్నికల నిర్వహణకు

పకడ్బందీ చర్యలు చేపట్టండి



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

రామచంద్రాపురం, మే 9: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు చేయాలని చంద్రగిరి నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ కైలాస్ వాంఖడే అధికారులను ఆదేశించారు. గురువారం రామచంద్రాపురం మండలంలో సమస్యాత్మకంగా ఉన్న ఎంఆర్ కమ్మపల్లి, నీకేపల్లి, కుప్పంబాదూరు, కొత్తకండ్రిగ పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ ఉషారాణి, ఎస్ఐ చిరంజీవి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణమ్మ, రెవెన్యూ సిబ్బందిప్రసాద్, చిరంజీవి, బాబు ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజ స్వామి ఆలయంలో

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుపతి(కల్చరల్) మే 9: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఆలయంలో మే 16 నుంచి 24వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఆలయాన్ని సంప్రదాయరీతిలో వివిధ పరిమళద్రవ్యాలతో శుద్ధిచేశారు. ఉదయం 6.30 గంటల నుంచి 9.30 వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. 10 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. చిన్న జీయరు స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, అర్చక బృందం పాల్గొన్నారు.

4,069మంది ఓటేశారు

తిరుపతి అర్బన్, మే 9: తిరుపతి నియోజకవర్గ పరిధిలో ఐదురోజులుగా జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో 4,069మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల నిర్వహణకు హాజరయ్యే సిబ్బంది 3,892మంది, హోంఓటింగ్ ద్వారా 84, ఆర్మీ 93మంది, మొత్తం 4,069మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పదివేలమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తా

- త్రిపుల్‌టీతో టూరిజం అభివృద్ధి
- ప్రతి మండలంలో పరిశ్రమల స్థాపన
- జెండా మోసిన నేతలనూ చెవిరెడ్డి నమ్మడం లేదు
- యువత మేనిఫెస్టో విడుదలలో పులివర్తి నాని



ప్రత్యేక మేనిఫెస్టో గురించి వివరిస్తున్న పులివర్తి నాని

తిరుపతి(కలెక్టరేట్), మే 9: 'చెవిరెడ్డి భాస్కరరెడ్డి తన అక్రమార్జన కోసం చంద్రగిరిని పదేళ్లుగా గాలికి వదలివేయడంతో నియోజకవర్గ అభివృద్ధి 25 ఏళ్లు వెనక్కివెళ్లింది. ఈ ఎన్నికల్లో తనను ఆదరిస్తే పరిశ్రమల స్థాపనకు కృషిచేస్తా' అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. నియోజకవర్గ యువత కోసం గురువారం సాయంత్రం తిరుచానూరు సమీపంలోని హోటల్‌లో ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేశారు. అధికారంలోకి రాగానే పదివేలమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసినట్లు స్పష్టం చేశారు. పరిశ్రమల స్థాపనకు ఎన్ఆర్ఐలు కూడా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అందులో భాగంగా చంద్రగిరి మండలంలో మినీ ఐటీ పార్కును నెలకొల్పి 2,500మందికి ప్రత్యక్షంగా, 3,500మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. రామచంద్రాపురం మండలంలో మెడికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ తయారీ, వాటి అనుబంధ రంగాల పరిశ్రమలను నెలకొల్పి 500మందికి ప్రత్యక్షంగా.. వెయ్యిమందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. చిన్నగొట్టిగల్లు మండలంలో పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్‌లను ఏర్పాటుచేసి 200మందికి ప్రత్యక్షంగా.. 300మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తామని తెలిపారు. తిరుపతి రూరల్ మండలంలో మెడికల్, లైఫ్ సైన్సెస్ క్లస్టర్ తీసుకువచ్చి ఒక అధునాతన కారిడార్ నిర్మాణం ఏర్పాటు చేసి వెయ్యిమందికి ప్రత్యక్షంగా.. పరోక్షంగా 1,500మందికి ఉపాధి కల్పిస్తామన్నారు. పాకాల మండలంలో గార్మెంట్ పరిశ్రమను నెలకొల్పి 500మందికి ప్రత్యక్షంగా, 500మంది పరోక్షంగా ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఎర్రావారిపాళెం మండలంలో తిరుచానూరు, తిరుమల, తలకోనలను అనుసంధానం చేస్తూ త్రిపుల్‌టీ టూరిజం ప్యాకేజీని తీసుకువచ్చి ఏకోథీమ్ పార్కుల నిర్మాణం చేపట్టి 500మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యిమందికి ఉపాధి కల్పిస్తామని నాని వెల్లడించారు. ఇవే కాకుండా టెన్త్, ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు అవసరమైన మార్గ నిర్దేశిక తరగతులు నిర్వహించి, వారిని సన్మార్గంలో నడిపించేందుకు కృషి చేస్తామన్నారు. యూత్ కాంప్లెక్స్‌ను నిర్మించి, అందులో కంప్యూటర్ సెంటర్, స్టడీ స్పేస్, గ్రంథాలయం, ఇండోర్, అవుట్‌డోర్ క్రీడా సముదాయాల నిర్మాణం చేపట్టడంతో పాటు స్విమ్మింగ్, జిమ్ తదితర వసతులు కల్పించి ఉచిత సభ్యత్వంతో నియోజకవర్గంలోని యువత ఉపయోగించుకునేలా అభివృద్ధి చేస్తామన్నారు. ఏటా ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల ద్వారా ఉద్యోగ మేళా నిర్వహించి, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని వివరించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డిలాగా తాను కుటుంబ పాలనకు వ్యతిరేకమన్నారు. చెవిరెడ్డి ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చకపోగా అక్రమార్జనతో రూ.5వేల కోట్లు వెనుకేసుకున్నాడని ఆరోపించారు. పదిహేనేళ్లుగా చెవిరెడ్డి కోసం జెండా మోసిన నేతలను సైతం ఆయన నమ్మడంలేదన్నారు. చివరికి తన సొంత ప్రయోజనాల కోసం వలంటీర్ల చేత బలవంతంగా రాజీనామా చేయించి, వారితో ఓటర్లకు తాయిలాల పంపిణీ, ఏజెంట్లుగా వాడుకుంటున్నారని విమర్శించారు. క్రికెట్ ముసుగులో మఠం భూములను కబ్జా చేశారన్నారు. అంతకుముందు చంద్రగిరి నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేస్తాననేది పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు శ్రీధర్‌వర్మ, ఈశ్వరరెడ్డి, దశరథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

- రాజస్థానీయులకు సీఎం భజన్‌లాల్ శర్మ పిలుపు



మాట్లాడుతున్న భజన్‌లాల్ శర్మ

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మే 9: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి చెందిన బీజేపీ, టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ జిల్లాలోని రాజస్థానీయులకు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని రామ తులసి కళ్యాణ మంటపంలో జరిగిన రాజస్థానీయుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భజన్‌లాల్ శర్మ మాట్లాడుతూ.... ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చినా, పథకాలు ప్రవేశపెట్టినా వైసీపీ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని విమర్శించారు. కేంద్ర పథకాలను తనవిగా ప్రచారం చేసుకుంటూ దిగజారుడుతనంగా వ్యవహరించిందన్నారు. ప్రభుత్వ విధానంవల్ల రాష్ట్రంలో అభివృద్ధి లేకుండా పోయిందన్నారు. ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. బీజేపీకి చెందిన తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావును, జనసేన, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నానీని భారీమెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జల్లి మధుసూదన్, నవీన్‌కుమార్‌రెడ్డి, మునిసుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు డాక్టర్ హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, అన్నా రామచంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత ఎన్నికలకు సహకరించాలి: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), మే 9: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా జరగడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విధుల్లో ఉన్న అధికారులను కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌తో కలిసి ఎన్నికల విధుల్లోని అధికారులతో సమీక్షించారు. మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్, తదితర అధికారులు పాల్గొన్నారు.

- ఈనెల 13న జరగనున్న పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేపట్టామని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు కలెక్టర్ తెలియజేశారు. విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా పోలింగ్‌పై జిల్లా అధికారులతో గురువారం సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, డీఆర్వో పెంచలకిషోర్ తదితరులతో కలిసి హాజరయ్యారు.

తిరుపతి అర్బన్: ఎన్నికల నేపథ్యంలో తిరుపతి అసెంబ్లీ ఆర్వో అదితిసింగ్‌తో కలసి గురువారం కరకంబాడీ రోడ్డు అక్కారంపల్లిలోని నలంద ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో జరుగుతున్న పోలింగ్ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. అంతకుముందు ఓటరు స్లిప్పుల పంపిణీపై బీఎల్వోలతో సమావేశమై సూచనలిచ్చారు.

దొంగ ఓట్లు వేస్తే జైలుకే..!

- జనసేన తిరుపతి ప్రాంత ఎన్నికల పరిశీలకుడు, ప్రముఖ దర్శక నిర్మాత ఏఎం రత్నం



మాట్లాడుతున్న ఏఎం రత్నం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 9: ఎవరైనా దొంగ ఓట్లు వేయాలనుకుంటే జైలుకు వెళ్లడం ఖాయమని ప్రముఖ దర్శక నిర్మాత, జనసేన తిరుపతి ప్రాంత ఎన్నికల పరిశీలకుడు ఏఎం రత్నం అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియాతో మాట్లాడారు. సినీ రంగంలో ఎంతో గుర్తింపు పొందినప్పటికీ పవన్ కల్యాణ్‌కు సమాజం పట్ల ఉన్న అంకిత భావానికి ఆకర్షితుడినై ఈ ఎన్నికల్లో పవన్ కల్యాణ్‌కు సహకరించాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. ప్రజల కోసం పనిచేస్తున్న పవన్ కల్యాణ్‌కు అన్ని విధాలుగా తాను అండగా నిలుస్తానని చెప్పారు. రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించడానికి పవన్ కల్యాణ్ కంకణం కట్టుకున్నారని తెలిపారు. ఇందుకోసం టీడీపీ, బీజేపీలతోకూటమిగా ఏర్పడ్డారని తెలిపారు. రాష్ట్రంలో కచ్చితంగా కూటమి అధికారాన్ని చేపట్టి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. తిరుపతిలోనూ ఆరణి శ్రీనివాసులు భారీ మెజారిటీతో గెలుస్తారని స్పష్టం చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు రాకతో తిరుపతిలో ఒక్కసారిగా ఎన్నికల వాతావరణం మారిపోయిందన్నారు. పవన్ కల్యాణ్, చంద్రబాబుకు జనం నీరాజనాలు పలకడమే ఇందుకు ఉదాహరణ అని వివరించారు. జనసేన నాయకులు కిరణ్ రాయల్, పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ.. తిరుపతి ప్రజలు.. కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును బాగా ఆదరిస్తున్నారని అభిప్రాయపడ్డారు. దీంతో వైసీపీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందని తెలిపారు. రాష్ట్రానికి మంచి రోజులు వస్తున్నాయని, ప్రజా పరిపాలనలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉంటారనీ, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని వారు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు అతికారి కృష్ణ, కూరగాయల లక్ష్మీపతి, రాజారెడ్డి, సుభాషిణి, కీర్తన, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

అభినయ్‌కు అంత ఆస్తి ఎక్కడిది? : టీడీపీ



మాట్లాడుతున్న చినబాబు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 9: తిరుపతి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న కోట్లాది రూపాయల విలువ చేసే ఆస్తులు ఎలా వచ్చాయని టీడీపీ నగర అధ్యక్షుడు వట్టికుంట శంకరనారాయణ (చినబాబు) ప్రశ్నించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఆస్తులు తనకు ఎలా వచ్చాయో నియోజకవర్గ ప్రజలకు అభినయ్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో కూటమి గెలుపుతో రాష్ట్ర భవిష్యత్తు మారబోతోందని అన్నారు. జగన్ చేసిన తప్పులకు ఓటు ద్వారా వైసీపీకి తగిన శిక్ష వేయాలని ప్రజలను కోరారు. ఈ సమావేశంలో నాయకులు రెడ్డెప్పనాయుడు, చిన్నారాయల్, రాంప్రసాద్, హర్షద్, మహాలక్ష్మి, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

శ్రీవారి దేవేరికి శఠారి కానుక



తిరుచానూరు, మే 9: తిరుమల శ్రీవారి దేవేరి అయిన తిరుచానూరు పద్మావతీ దేవికి వైజాగ్‌కు చెందిన మస్తాన్‌రావు 425 గ్రాముల బంగారు శఠారిని గురువారం అందజేశారు. రూ.25లక్షల విలువ చేసే ఈ శఠారిని డిప్యూటీ ఈవో గోవిందరాజన్ ఆలయం తరపున అందుకున్నారు.

డాక్టరేట్ ప్రదానం



కంపా రాజేష్

తిరుపతి(విద్య), మే 9: ఎస్వీయూ అర్థశాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి, శ్రీగోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు కంపా రాజేష్ డాక్టరేట్ పొందారు. ఆచార్య మేడసాని దేవరాజులు పర్యవేక్షణలో 'ట్రెండ్స్ అండ్ సప్లై రెస్పాన్స్ బిహేవియర్ ఆఫ్ మేజర్ ఫుడ్ అండ్ నాన్ ఫుడ్ క్రాప్స్ ఇన్ రాయలసీమ రీజియన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినట్లు సీఈ దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

13న కార్మికులకు సెలవు

తిరుపతి(ఆటోనగర్), మే 9: రాష్ట్రంలో ఈ నెల 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కార్మికులు ఓటు హక్కును వినియోగించుకోవడానికి ప్రభుత్వం సెలవు ప్రకటించిందని ఉపకార్మిక కమిషనర్ బాలూ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు, పరిశ్రమలు, ఇతర ప్రైవేటు సంస్థల యజమానులు ఈ ఆదేశాలను అమలుచేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించిన యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అబద్ధపు హామీలను నమ్మకండి

రాయల్స్ పీపుల్స్ ఫ్రంట్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 9: స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజలను నమ్మించి అడ్డదారుల్లో అధికార పీఠం ఎక్కడానికి రాజకీయ నేతలు చెప్పే అబద్ధపు హామీలను ఎవ్వరూ నమ్మవద్దని రాయల్స్ పీపుల్స్ ఫ్రంట్ కోరింది. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో రాయల్స్ పీపుల్స్ ఫ్రంట్ ప్రతినిధి రెడ్డిశేఖర్ మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో కాపు సామాజిక వర్గం అధికంగా ఉన్నారని, కాపుల మధ్య ఐక్యత ఏర్పడితే మంచి పరిపాలన అందించే వారిని ఎన్నుకోవచ్చని తెలిపారు. రాష్ట్రానికీ, కాపులకూ మంచి చేసే వారికి ఓటు వేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు నరసింహ, సావిత్రమ్మ, దేశాయిరెడ్డి, రెడ్డి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెడ్డిశేఖర్

కూటమి అభ్యర్థులను గెలిపించండి: టీఎన్‌టీయూసీ



మాట్లాడుతున్న సింధూజ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 9: ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింధూజ పిలుపునిచ్చారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతి అసెంబ్లీ, పార్లమెంటు అభ్యర్థులు ఆరణి శ్రీనివాసులు, వరప్రసాద్‌లకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. వీరి గెలుపుతో తిరుపతి అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. నాయకులు రెడ్డెప్పరెడ్డి, తులసీదాస పాల్గొన్నారు.

ఏజెంట్లు 5గంటలకే రిపోర్టు చేయాలి

తిరుపతి అర్బన్, మే 9: 13న జరిగే ఎన్నికల సందర్భంగా ఉదయం 5గంటలకే అభ్యర్థుల ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకోవాలని తిరుపతి నియోజకవర్గ ఆర్వో అదితిసింగ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏజెంట్ తన ఓటు అదే లేదా పక్క పోలింగ్ కేంద్రమై ఉండాలని, నియోజకవర్గం పరిధి ఏజెంట్ నియమించడంలో ఇబ్బంది ఉంటే తప్పనిసరిగా ఎపిక్ కార్డు, ఈసీ సూచించిన ప్రత్యామ్నాయ పత్రాన్ని కలిగి ఉండాలన్నారు.

టీడీపీ పాలనలోనే కాపుల అభివృద్ధి: కాపునాడు



మాట్లాడుతున్న నాగరాజు రాయల్, లక్ష్మీపతి రాయల్ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 9: టీడీపీ పాలనా కాలంలోనే కాపుల అభివృద్ధి జరిగిందని కాపునాడు పేర్కొంది. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం కాపునాడు నాయకులు సరిత నాగరాజ రాయల్, బండ్ల లక్ష్మీపతి రాయల్, గుట్ట నాగరాజ రాయల్ మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం కాపులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి అన్ని అన్ని విధాలుగా ఆదుకుందన్నారు. దీంతో కాపులు ఎంతో ప్రయోజనాన్ని పొందారని, ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని వారు సూచించారు. అప్పుడే కాపులకు న్యాయం జరుగుతుందని, లేనిపక్షంలో కాపులు అభివృద్ధిలో వెనుకబడిపోతారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌లను గెలిపించాలని పిలుపునిచ్చారు. పలువురు కాపునాడు నాయకులు పాల్గొన్నారు.

జగనా.. 'ఆశా' నిరాశేనా..

- పాదయాత్ర హామీల సంగతేంటి?
- పనిభారం పెంచి.. జీతాల పెంపు మరిచి
- నిర్బంధ కార్యకర్తల్లా ఆశా వర్కర్లు





అన్నొస్తాడు.. మీకు అండగా నిలబడతాడు. పని భారం తగ్గించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపిస్తాడు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్నీ రాయితీలు అందిస్తాడు.

\- గత ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్‌రెడ్డి ఆశావర్కర్లకు ఇచ్చిన హామీ ఇది..

అందరిలాగే తామూ జగన్ మాటలు నమ్మి మోసపోయామని ఆశా వర్కర్లు గుర్తించారు. దగా చేసిన వైసీపీ ప్రభుత్వంపై ఇటీవల వీరు నిరసనలకు దిగారు. గర్భిణులు, తల్లీబిడ్డలకు అండగా ఉండాల్సిన తమను స్థానిక నేతల చేతుల్లో కీలుబొమ్మలా మార్చేసిందని శాపనార్థాలు పెడుతున్నారు. నాసిరకం ఫోన్లు ఇచ్చి, పనిభారం పెంచి నా ఆడపడుచులంటూ చివరకు రోడ్డుపైకి తీసుకువచ్చాడంటూ జగన్‌ను తూర్పారబెడుతున్నారు. పాదయాత్ర హామీలను అమలు చేయకపోగా ఐదేళ్లలో ముప్పుతిప్పలు పెట్టిన ఈ ప్రభుత్వానికి సరైన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని జిల్లాలోని 1,705 మంది ఆశా వర్కర్లు చెబుతున్నారు.

టీడీపీ హయాంలో పరిస్థితి ఇది: 2014లో ఆశావర్కర్ల సమస్యలపై టీడీపీ ప్రభుత్వం దృష్టి సారించింది. కష్టానికి తగిన ప్రతిఫలాన్ని ఇవ్వాలని రూ.3వేల వేతనంతోపాటు టీఏ,డీఏలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు చేయిస్తే ప్రోత్సాహక నగదు బహుమతుల కింద నెలకు దాదాపు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు వచ్చేలా చర్యలు తీసుకుంది. రొటీను విధులు తప్ప అదనపు భారాన్ని మోపలేదు. నివాస ప్రాంతాల్లోనే డ్యూటీ చేసేవారు. ఈనేపథ్యంలో ఆశాలకు రూ.10వేల వేతనం పెంచాలనే ఆలోచనకూ టీడీపీ ప్రభుత్వంలోనే పునాది పడింది. ఇంతలోనే ఎన్నికలు రావడంతో అధికారంలోకి వచ్చాక రూ.10వేల వేతనమిస్తామని జీవో విడుదలచేసింది.

వైసీపీ ప్రభుత్వంలో పరిస్థితి ఇది: వైసీపీ అధికారంలోకి వచ్చాక రూ.10వేల వేతనం పెంచామని చెబుతున్నా అందులో కేంద్ర ప్రభుత్వం రూ.3,342 ఇస్తోంది. మిగిలిన రూ.6,658 మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. జీతంతోపాటు పదింతల పనిభారాన్ని కూడా పెంచడంతో ఆనంద పడాలో, బాధపడాలో అనే ఆశా వర్కర్లకు అంతుపట్టలేదు. అప్పటివరకు వీరిపై అజమాయిషీ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారులకే ఉండేది. కానీ జగన్ ప్రభుత్వం ఆ అధికారం స్థానిక నేతల చేతుల్లోకి మార్చింది. సెల్‌ఫోన్లు ఇచ్చి యాప్‌లలో గర్భవతుల, ఇతర వైద్యసేవల వివరాలు నమోదు చేయాలని ఆదేశించడం తలకు మించిన భారంలా తయారైంది. ఎలాగోలా పని చేద్దామంటే యాప్‌లు, ఫోన్లు సక్రమంగా పనిచేయడం లేదు. ఏఎన్ఎంల పనితోపాటు ఇతర పనులను కూడా వీరికే అప్పగించింది. స్థానికంగా వైసీపీ కార్యక్రమాలన్నింటికీ ముందుండి ఏర్పాట్లు చేయడం, మహిళలను తీసుకురావడం వంటి బాధ్యతలను కూడా చూడాలని ఆదేశించింది. వ్యతిరేకించిన ఆశాలను తక్షణమే విధుల నుంచి తొలగిస్తామని హుకుం జారీ చేసింది. దీంతో గర్భవతుల సేవలు మరిచి.. వైసీపీ నేతల సేవలో ఆశావర్కర్లు తరించాల్సి వచ్చింది.

ఐదేళ్లుగా పరిష్కారం కాని డిమాండ్లు : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రూ.26వేల కనీసం వేతనం ఇస్తే వైద్య ఉద్యోగులుగా గుర్తించాలి. సామాజిక, ఉద్యోగ భద్రత కల్పించాలి. జీతంలో సగభాగం పెన్షన్ ఇవ్వాలి. రిటైరైన వారికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందించాలి. రూ.10లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్, జిల్లా వైద్యాధికారి సంతకంలో జారీచేసే గుర్తింపు కార్డు, నాణ్యమైన యూనిఫాం, అర్హత కలిగిన వారికి ప్రమోషన్లు వంటివి కల్పించాలని ఐదేళ్లుగా ఆశా వర్కర్లు ఆందోళన చేపడుతున్నారు.

\- తిరుపతి(వైద్యం)

మానసిక రోగులుగా చేశారు



పనిభారం పెంచి, చాలిచాలనీ వేతనాలతో ఆశావర్కర్లను మానసిక రోగులుగా చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కుతుంది. నిత్యం గర్భవతితోపాటు కడుపులోని బిడ్డకు రక్షణగా ఉండాల్సిన ఆశావర్కర్లను అధికార పార్టీ నేతలు సొంత సేవలో తరించాలని ఇబ్బందులకు చేయడం బాధాకరం. రూ.10 వేల వేతనానికి పదింతల పనిభారం పెంచి ముప్పుతిప్పలు పెట్టడం అన్యాయం.

\- లక్ష్మీకళ, ఆశావర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

వైసీపీ కార్యకర్తలుగా మార్చేశారు



ఆశా వర్కర్లను వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వారి పార్టీ కార్యకర్తలుగా మార్చేశారు. పదింతల పనిభారంతోపాటు స్థానిక వైసీపీ నేతలు చెప్పే పనులు కూడా చేయాలని హుకుం జారీ చేశారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చిన దాఖలాల్లేవు. ఆందోళనకు దిగితే పోలీసులతో బెదిరింపులు, ఆందోళన శిబిరాల నుంచి బలవంతంగా పంపేయడం వంటి అమానుష చర్యలకు పాల్పడుతున్నారు.

\- గంగాదేవి, ఆశావర్కర్ల ప్రధాన కార్యదర్శి

తిరుపతి

13న స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి(వైద్యం), మే 9: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈనెల 13వ తేదీ(పోలింగ్ రోజు)న స్విమ్స్‌లో ఓపీ, ఓటీ సేవలకు సెలవు ప్రకటించారు. ఈ మేరకు డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.09 కోట్లు

తిరుమల, మే 9 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.09 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, ఆదాయాన్ని గురువారంఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 64,766మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 24,158 మంది తలనీలాలు సమర్పించారు.

స్విమ్స్‌లో సర్వం దోపిడీ

- ఆస్పత్రులను వ్యాపార కేంద్రాలుగా మార్చిన వైసీపీ
- ఇంటింట ప్రచారంలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ స్థాపించిన స్విమ్స్, బర్డ్ ఆస్పత్రులను వైసీపీ ప్రభుత్వం వ్యాపార కేంద్రాలుగా మార్చేసిందని, 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం డివిజన్లోని ప్రతి ఇంటికీ వెళ్లి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఈసందర్భంగా ఆర్సీ మాట్లాడుతూ.. స్విమ్స్‌లో మెడికల్ షాపులను అయినవారికి ఇష్టారాజ్యంగా కట్టబెట్టేశారని, రూ.15లక్షలు అద్దె పలికే షాపులను రూ.17వేలకు అప్పజెప్పేశారన్నారు. కావాల్సిన వారికి నిబంధనలకు విరుద్ధంగా షాపులు కేటాయించి, టీటీడీ ఆదాయానికి గండికొట్టేశారని మండిపడ్డారు. ఓపీ ఫీజులు పెంచేశారని, బర్డ్‌లో డబ్బులిస్తేనే ఆపరేషన్లు లేదంటే.. ఏడాది తర్వాత రమ్మంటారన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ఆస్పత్రులను ప్రక్షాళన చేస్తామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను
అత్యధిక మెజార్టీతో గెలిపించండి
టీడీపీ నేత భువన్‌కుమార్‌రెడ్డి


32వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న భువన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), మే 9: ఎన్డీయే కూటమి అభ్యర్థులు ఆరణి శ్రీనివాసులు (ఎమ్మెల్యే అభ్యర్థి)కి గాజుగ్లాసు గుర్తుపై, వరప్రసాదరావు (పార్లమెంటు అభ్యర్థి)కి కమలం గుర్తుపై ఓటువేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ నాయకుడు, తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు మాజీ డైరెక్టర్ భువన్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం 32వ డివిజన్‌లోని కోటకొమ్మల వీధి లేఅవుట్, రెడ్డిరెడ్డి కాలనీలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా భువన్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. తిరుపతి అభివృద్ధి పథంలో నడవాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహేష్‌రెడ్డి, మనోజ్, ఖాదర్, ఈశ్వర్, హరీష్, కవిత, యశోద, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

మెగా కుటుంబం అడ్డా తిరుపతి
జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌రాయల్

తిరుపతి అర్బన్, మే9: మెగా కుటుంబం అడ్డా తిరుపతి అని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ అన్నారు. గురువారం నగరంలోని ఓ హోటల్లో జరిగిన ఉమ్మడి చిత్తూరు జిల్లా మెగా అభిమానుల జరిగిన ముఖ్య సమావేశంలో ఆయన ప్రసంగించారు. దేశవ్యాప్తంగా ఉన్న మెగా అభిమానులు ఏకమవ్వాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాక్షస పాలకులను గద్దె దించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పవన్‌కల్యాణ్‌సహా 21మంది కూటమి జనసేన అభ్యర్థులకు మద్దతు పలికి.. గెలిపించుకోవాల్సిన బాధ్యత అభిమానులపై ఉందని చెప్పారు. ముఖ్యంగా తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు విజయానికి శక్తి వంచన లేకుండా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. మెగాస్టార్ చిరంజీవి తరహాలో మెజారిటీ రావాలని, ఇందుకోసం ఇతర హీరోల అభిమానులను కూడా కలుపుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, అఖిలభారత చిరంజీవి అసోసియేషన్ అధ్యక్షుడు స్వామినాయుడు, నిర్మాత ఏఎంరత్నం, పగడాల మురళి, పూలప్రభాకర్, ప్రకాష్, పురుషోత్తం, ఆకేపాటి సుభాషిణి, శిరీష, పొన్నగంటి భాస్కర్, దుర్గా, పెద్ద సంఖ్యలో మెగా అభిమానులు పాల్గొన్నారు.

ఓటమి భయంతో
నోటికొచ్చినట్టు వాగుతున్నారు

- దొంగ ఓట్లను నమ్ముకునే పనిలో ఉన్నారు
- భూమన, అభినయ్‌రెడ్డిపై ఆరణి ఆగ్రహం
- తిరుమల వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తా

తిరుపతి, మే 9 (ఆంధ్రజ్యోతి): భూమన కరుణాకర రెడ్డి, అభినయ్ రెడ్డిలకు ఓటమి భయం పట్టుకుంది. అందుకే నోటికొచ్చినట్టు వాగుతున్నారు. ప్రజలను వదిలి.. దొంగ ఓట్లను నమ్ముకునే పనిలో ఉన్నారు' అని ఎన్డీఏ కూటమి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల చిరువ్యాపారుల ఆత్మీయ సమావేశం గురువారం ఓ హోటల్‌లో జరిగింది. చిరు వ్యాపారుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. తమకు గుర్తింపు కార్డులు, స్థానికులందరికీ హాకర్ లైసెన్సులు ఇప్పించాలని కోరారు. ఆరణి మాట్లాడుతూ.. చిరు వ్యాపారుల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ప్రసంగించగా, టీడీపీ నాయకులు పులుగోరు మురళి, సింగంశెట్టి సుబ్బరాయులు పాల్గొన్నారు

తిరుమలలో ఆరణి కుటుంబీకుల ప్రచారం



తిరుమల, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కుటుంబ సభ్యులు గురువారం తిరుమలలో స్థానికులు నివసించే ఆర్బీ సెంటర్, సీ, డీ, న్యూ సీ టైప్ క్వార్టర్స్‌లో ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి ఆరణి శ్రీనివాసులును భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోడలు శిరీష, కుటుంబ సభ్యులు శ్రావణి, రాజలక్ష్మి, పద్మజ, సంధ్య అభ్యర్థించారు. తిరుమల టీడీపీ నాయకులు రాజయాదవ్, శివషణ్ముగం, దేవరాజ్, ఆనంద్, బాలాజీ, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

చిరు అభిమానులు తిరుపతిని పవన్‌కు గిఫ్ట్ ఇవ్వాలి

- జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, మే 9 (ఆంధ్రజ్యోతి): చిరంజీవి అభిమానులు తిరుపతిలో జనసేనను గెలిపించి, పవన్ కల్యాణ్‌కి గిఫ్టుగా ఇవ్వాలని ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం ఓ హోటల్‌లో జరిగిన మెగా అభిమానుల ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. చిరంజీవి గెలిచిన తిరుపతిలో జనసేనాని ప్రతినిధిగా పోటీచేస్తున్న తనను.. గాజుగ్లాసు గుర్తుపై ఓటేసి, భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మెగా కుటుంబంతో తన అనుబంధాన్ని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ.. దౌర్జన్యంతో తన కొడుకును గెలిపించుకునేందుకు భూమన కరుణాకరరెడ్డి చూస్తున్నాడని అన్నారు. మెగాస్టార్ అభిమానులు అప్రమత్తంగా ఉంటూ.. వైసీపీ కుయుక్తులను అడ్డుకోవాలని సూచించారు. అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షుడు స్వామి నాయుడు మాట్లాడుతూ ఆరణిని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి చిరంజీవి అభిమానిపైనా ఉందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేత పులుగోరు మురళి, జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, ఏఎం రత్నం, కిరణ్ రాయల్, చిత్తూరుజిల్లా చిరంజీవి ఫ్యాన్ అసోసియేషన్ అధ్యక్షుడు పూల ప్రభాకర్, పగడాల మురళి, బీజేపీ నాయకులు పొనగంటి భాస్కర్, జనసేన లీగల్ సెల్ అధ్యక్షురాలు శిరీష, సుభాషిణి, మట్టపల్లి మునిరాజు, రాజారెడ్డి, బండ్ల లక్ష్మీపతిరాయల్ తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్రనగర్‌ను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం: రాఘవేంద్ర నగర్ కాలనీలో వాసులతో గురువారం టీడీపీ కార్యాలయంలో ఆరణి సమావేశమయ్యారు. తుడా అప్రూవలైన రాఘవేంద్ర నగర్‌ను హథీరాంజీ మఠం పేరుతో నిషేధిత జాబితాలో పెట్టినట్లు కాలనీవాసులు ఆరణి దృష్టికి తీసుకొచ్చారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని ప్రభుత్వం ఏర్పాటు కాగానే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా టీడీపీ సీనియర్ నేత శ్రీహరి నాయుడు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఆరణి శ్రీనివాసులును సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే మోహన్, శ్రీధర్ వర్మ, రాఘవేంద్రనగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు వెంకటయ్య నాయుడు, శ్రీనివాస రాజు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



వైసీపీనుంచి ఎన్డీఏలోకి చేరికలు

తిరుపతి, మే 9 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఆటోనగర్‌కు చెందిన వంద మంది గురువారం ఉదయం తెలుగుదేశం, జనసేన పార్టీలో చేరారు. తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, ఆరణి జగన్‌ల సమక్షంలో చేరికలు జరిగాయి. టీడీపీలోకి చేరిన వారికి నరసింహయాదవ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జనసేనలో చేరిన వారికి ఆరణి జగన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆటో యూనియన్ నేతలు వెంకటేష్, జగన్నాథం, సాయి మోనిత, గిరిషా, ఉషా, వైసీపీ నుంచి టీడీపీలోకిచేరిన రంజిత్ నాయుడు, రమేష్, నరసింహులు, వేణు, శంకర్, బాలాజీ తదితరులున్నారు. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కృష్ణయాదవ్, రామాయాదవ్, చల్లా, వార్డు టీడీపీ అధ్యక్షుడు పెంచలయ్య, జనసేన ఉపాధ్యక్షుడు బాబ్జీ పాల్గొన్నారు.



తిరుపతిలో వైసీపీ గెలిస్తే
ప్రజల ఆస్తులకు పెనుముప్పు


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కార్పొరేటర్లు

తిరుపతి, మే 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీని వీడిన కార్పొరేటర్లందరూ గురువారం ప్రెస్‌క్లబ్ వేదికగా అధికార పార్టీ ఆగడాలను ఎండగట్టారు. అసమ్మతి కార్పొరేటర్ల ఇళ్ల దగ్గర కాపలా కాయకుండా వదిలిపెడితే ఒక్కరోజులో కౌన్సిల్ మొత్తం కూలిపోతుందని వ్యాఖ్యానించారు. తిరుపతిని అభివృద్ధి చేసివుంటే వైసీపీ కార్పొరేటర్లు పార్టీని ఎందుకు విడిచిపెడుతున్నారో సమాధానం చెప్పాలని 35వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ సవాల్ విసిరారు. ఆయనతోపాటు కార్పొరేటర్లు అన్నా అనిత, అన్నా సంధ్య, సీకే రేవతి, కల్పనా యాదవ్, నారాయణలు మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అభినయ రెడ్డి తానే తిరుపతిని అభివృద్ధి చేసినట్లు బాకా ఊదుతున్నారన్నారు. అభివృద్ధి చెందింది తిరుపతి కాదని.. మీ కుటుంబంతోపాటు కొంతమంది కార్పొరేటర్లు మాత్రమేనని మండిపడ్డారు. భూమన అంటే ఖాళీ భూములన్నీ మావే అన్నంతగా దోచేస్తున్నారని మండిపడ్డారు. తిరుపతిలో వైసీపీ గెలిస్తే ప్రజల ఆస్తులకు పెనుముప్పు జరుగుతుందన్నారు. మేయర్‌కు అధికారాలు లేకుండా చేసేశారని, ముద్ర నారాయణకు డిప్యూటీ మేయర్ పదవి రూపంలో పళ్లెంలో భోజనం పెట్టి మొత్తం వాళ్లే తింటున్నారన్నారు. ఎమ్మెల్యే ఊర్లో లేకపోతే కౌన్సిల్ సమావేశం జరగాల్సిన సమయానికి జరగదన్నారు. కొడుకు ఏదిచెబితే అదే వాళ్ల నాయన కూడా చేయాల్సిందేనన్నారు. పదిమందిలోపు కార్పొరేటర్లు తప్ప తక్కినవారికి కనీస మర్యాదలు కూడా లేకుండా చేశారని వాపోయారు. వీరి బాధను తట్టుకోలేక ఓ కార్పొరేటర్ స్టాండింగ్ కౌన్సిల్‌కు రాజీనామా చేశారన్నారు. తిరుమల నుంచి కుక్కలదొడ్డి వరకు మూడోదారి వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని, దీనివల్ల తిరుపతి ఉనికి కోల్పోతుందన్నారు. మన తిరుపతిని మనమే కాపాడుకోవాలంటే జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

22ఏ నుంచి విముక్తి కలిగిస్తాం: నవీన్

తిరుపతి (జీవకోన), మే 9: నగరంలోని పెద్దకాపువీధి, చింతలచేను, డీబీఆర్‌రోడ్డు పరిసర ప్రాంతాల ప్రజలను పట్టి పీడిస్తున్న 22ఏ నుంచి ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే విముక్తి కల్గిస్తామని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. పెద్దకాపు వీధిలో తవ్వేసిన రోడ్డు సమస్యను కూడా పరిష్కరిస్తామని చెప్పారు.

చంద్రబాబు, పవన్‌లపై టీటీడీ చైర్మన్ విమర్శలు

తిరుపతి, మే 9 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం చంద్రబాబు, జనసేనాని పవన్‌లపై టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి విమర్శలు గుప్పించారు. గురువారం గ్రూప్ థియేటర్ సర్కిల్లో జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. తనపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని చెప్పారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గురుమూర్తి, అభినయ్‌రెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయరు ముద్ర నారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా, కరుణాకరరెడ్డి ప్రసంగానికి ముందే పలువురు కార్పొరేటర్లు, సభకు హాజరైన జనం తిరుగుముఖం పట్టడం గమనార్హం.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం: వరప్రసాద్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వెలగపల్లి వరప్రసాద్‌రావు - తిరుపతిలో ప్రచారం నిర్వహిస్తున్న కొల్లూరి లక్ష్మి, స్ఫూర్తి తదితరులు

తిరుపతి, (ఉపాధ్యాయనగర్) మే 9: బీజేపీ అవలంబిస్తున్న విధానంతోనే దేశం సుస్థిర భారతదేశంగా అవతరిస్తోందని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు అన్నారు. గురువారం ఓ ప్రైవేట్ హోటల్‌లో గాండ్ల కుల మనః కలయిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వరప్రసాద రావు మాట్లాడుతూ... ఎన్డీఏ కూటమికి బీసీలే వెన్నముకలాంటివారని కొనియాడారు. వైసీపీ ప్రభు త్వం కులాల వారీగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందేగానీ వాటి అభి వృద్ధికి నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేసిందని ధ్వజమెత్తారు. అరాచకం, అప్పులే జగన్ ప్రభుత్వ వైఖరిగా మారిందని కనీసం ఎటువంటి అభివృద్ధి జరగలేదని వాపోయారు. ఇటువంటి ప్రభుత్వం మనకు అవసరమా అని ప్రశ్నించారు. గతంలో తాను ఎంపీగా పని చేసినప్పుడు అభివృద్ధికి బీజేపీ సహకారం అందించిందని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వానికి బుద్ధిచెప్పేలా ఎన్డీఏ కూటమికి ఓట్లువేసి గెలిపిం చాలని కోరారు. తాను ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో గాండ్లకుల నాయకులతోపాటు బీజేపీ నాయకులు విష్ణుకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో విస్తృతంగా ప్రచారం...

తిరుపతిలో బీజేపీ తరపున విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు జరిగాయి.ఇందిరానగర్, టౌన్‌క్లబ్, ఐఎస్‌మహల్‌రోడ్డు, బైరాగిపట్టెడ, ఎస్టీవీ నగర్, ఎయిర్ బైపాస్‌రోడ్డు, అంబేడ్కర్ కాలనీల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ప్రచారంలో తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు సతీమణి కొల్లూరి లక్ష్మి, కుమార్తె డాక్టర్ స్ఫూర్తి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి బీజేపీ, టీడీపీ, జనసేన అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలంటూ అభ్యర్థించారు. ప్రచారం చేస్తున్న తమను స్థానికులు ఎంతో ప్రేమాభిమానాలతో ఆదరిస్తున్నారని వారి ఆదరాభిమానాలు చూస్తుంటే తమ విజయం ఖాయమని అనిపిస్తుందని వారు అన్నారు.

సీపీఐ అభ్యర్థిని గెలిపించండి: నారాయణ



మీడియాతో మాట్లాడుతున్న నారాయణతో సీపీఐ నేతలు

తిరుపతి(ఆటోనగర్), మే 9: నిత్యం ప్రజల్లో వుండే తిరుపతి సీపీఐ అభ్యర్థి పి.మురళిని గెలిపించాలని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విజ్ఞప్తి చేశారు. తిరుపతి సీపీఐ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు.తిరుపతిలో వైసీపీ,టీడీపీ నేతలు పట్టపగలు డబ్బులు పంపిణీ చేస్తున్నప్పటికీ పట్టుకోకుండా ఎన్నికల అధికారులు ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.నగరిలో రోజాను జాతరలో గంగమ్మను ప్రజలు సాగనంపేవిధంగా ఓడించి పంపుతారని చెప్పారు.రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీని ఓడించాలని నారాయణ విజ్ఞప్తి చేశారు. మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడుతూ ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు.ఒక పార్టీలో గెలిచి మరోపార్టీలో చేరి మంత్రి పదవులు అనుభవిస్తున్న వారి పట్ల ఎన్నికల కమిషన్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.సీపీఐ అభ్యర్థి పి.మురళి, నాయకులు పి.హరినాధరెడ్డి,ఎ.రామానాయుడు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

చావుకు కారణం తెలియజేయాలన్నా డబ్బివ్వాల్సిందే!

- రుయాస్పత్రిలో ఓ బాధితుడి ఆవేదన


జయమ్మ కుమారుడు పవన్

తిరుపతి(వైద్యం), మే 9: రుయాస్పత్రిలో చావుకు కారణం తెలియజేయాలన్నా చేయి తడపనిదే పని కావడం లేదని ఓ బాధితుడు వాపోయాడు. తన తల్లి డెత్, కాజ్ ఆఫ్ డెత్ సర్టిఫికెట్ల కోసం వస్తే డబ్బు ఇక్కడి సిబ్బంది డిమాండ్ చేశారని ఆరోపించాడు. నాయుడుపేటకు చెందిన బాధితుడు పవన్ గురువారం ఆస్పత్రి ఆవరణలో మీడియాకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాయుడుపేటకు చెందిన మదనంబేటి జయమ్మ(41) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుంటే ఆమెను చికిత్స నిమిత్తం ఏప్రిల్ నాల్గవ తేదీన రుయాస్పత్రిలో అడ్మిట్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదేనెల ఎనిమిదో తేదీన మృతిచెందింది. తర్వాత జయమ్మ మరణ ధ్రువీకరణ పత్రం (డెత్ సర్టిఫికెట్), మరణానికి కారణం తెలుపుతూ డాక్టర్ ఇచ్చే సర్టిఫికెట్ (కాజ్ ఆఫ్ డెత్) సర్టిఫికెట్ కోసం ఆమె కుమారుడు పవన్ పది రోజుల కిందట వచ్చాడు. కాజ్ ఆఫ్ డెత్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు డాక్టరు. రూ.500 అడగడంతో అంత ఇవ్వలేనని చెప్పడంతో సర్టిఫికెట్ ఇవ్వకుండా తిప్పించుకుంటున్నారు. చివరకు ఆస్పత్రిలో తెలిసిన ఓ ఉద్యోగికి విషయం చెప్పగా.. ఆయన రూ.500 ఇస్తే, దాన్ని వైద్యుడికి ఇచ్చి కాజ్ ఆఫ్ డెత్ సర్టిఫికెట్ తీసుకున్నాడు. అలాగే డెత్ సర్టిఫికెట్ కోసం వెళితే అక్కడ కూడా ఇదే పరిస్థితి ఎదురవడంతో రూ.200 ఇవ్వాల్సి వచ్చింది. రెక్కాడితే కానీ డొక్కాడని తాము సర్టిఫికెట్ల కోసం కూడా డబ్బు చెల్లించాల్సి రావడం దారుణమని పవన్ ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభును వివరణ కోరగా.. ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారించి, చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇకపై ఇలాంటి పునరావృతం కాకుండా చూస్తామన్నారు.

ఎస్వీ సంగీత, నృత్య కళాశాల కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కల్చరల్), మే 9: తిరుపతిలో టీటీడీకి చెందిన ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, నాదస్వర పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి ప్రవేశానికి ఈనెల 25వ తేదీనుంచి దరఖాస్తులు ఇవ్వనున్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 12వ తేదీలోగా కళాశాలలో అందజేయాలని టీటీడీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సంగీత, నృత్య కళాశాలలో.. గాత్రం, వయోలిన్, వీణ, ఫ్లూట్, నాదస్వరం, భరతనాట్యం, హరికథ. మృదంగం, డోలు, ఘటం విభాగాల్లో విశారద(ఫుల్‌టైం), ప్రవీణ (డిప్లొమో) కోర్సులున్నాయి.

నాదస్వర, డోలు పాఠశాలలో..

నాదస్వర, డోలు పాఠశాలలో ఫుల్ టైం సర్టిఫికెట్, డిప్లొమో కోర్సులున్నాయి. బయటి ప్రాంత విద్యార్థులకు హాస్టల్ వసతి ఉంది. కళాశాలలో రూ.50 చెల్లించి దరఖాస్తు పొందవచ్చు. పూర్తి వివరాలకు 0877-2264597, 73308 11173, 98483 74408, 94407 93205 నెంబర్లను సంప్రదించాలి.

ఎస్వీయూ హెల్త్ సెంటర్‌లో వీసీ తనిఖీలు / సిబ్బంది గైర్హాజరుపై వివరణ ఇవ్వాలని ఆదేశాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 9: విద్యార్థులు, ఉద్యోగులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అందుబాటులో ఉండాల్సిన హెల్త్ సెంటర్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే ఎలా? అని ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. యూనివర్సిటీ ఆరోగ్య కేంద్రంలో గురువారం ఉదయం వీసీ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఉదయం 8 గంటల నుంచీ విధి నిర్వహణకు సిబ్బంది హాజరు కావలసి ఉండగా, 8.45 గంటలు అయినా ఒకరిద్దరు మినహా సిబ్బంది ఎవ్వరూ అందుబాటులో లేకపోవడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. మెడికల్ షాపు, ల్యాబ్, నర్సింగ్ వంటి సెక్షన్లకు సంబంధించిన 22 మంది సిబ్బంది విధులకు హాజరు కాకపోవడం ఏమిటని అక్కడున్న సిబ్బందిని ప్రశ్నించారు. ఈ పరిస్థితి మారకపోతే చర్యలు తప్పవని వీసీ స్పష్టం చేశారు. గైర్హాజరుపై ఉద్యోగులు వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

మద్యం డంప్‌లకు అడ్డాగా మంగళం రోడ్డు?

మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తూ వారంలోనే రెండుసార్లు పట్టుబడ్డ మహిళ



తిరుపతి(నేరవిభాగం), మే 9: ఎన్నికల నేపథ్యంలో మంగళం రోడ్డులోని బీటీఆర్ కాలనీ, జీవకోన, సత్యనారాయణపురం ప్రాంతాలను మద్యం డంపులకు అడ్డాగా చేసుకున్నారా.. అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఎందుకంటే బీటీఆర్ కాలనీలోని 11వ లైన్‌లో చిన్న దుకాణం పెట్టుకుని నిర్వహిస్తున్న అరుణకుమారి 20 రోజుల వ్యవధిలోనే దాదాపు 25 క్వార్టర్ బాటిళ్ల అక్రమంగా విక్రయిస్తూ పట్టుబడింది. తాజాగా గురువారం ఆమె వద్ద నుంచే మళ్లీ దాల్‌హౌస్ బ్రాండ్ క్వార్టర్ బాటిళ్లను సెబ్ అధికారులు సీజ్ చేసి, జైలుకు తరలించారు. ఈమె రెండుసార్లు అరెస్టవడంతోపాటు 9వ లైన్‌లో కాపురమున్న రాజా వద్ద నుంచి కూడా 12 క్వార్టర్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు.

ఏం జరుగుతోందంటే..: తమిళనాడు, పుదుచ్చేరి, చెన్నై, తిరుత్తణి ప్రాంతాల నుంచి మద్యాన్ని దిగుమతి చేసుకుంటున్నట్లు సమాచారం. కొందరైతే ఏకంగా స్థానిక ఆర్టీసీ గ్యారేజీలో పనిచేస్తున్న తాత్కాలిక సిబ్బంది ద్వారా బస్సుల్లో తెప్పించి స్టాకు పెడుతున్నట్లు తెలిసింది. దీనిపై ఎన్నికల అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

జన చైతన్యం

? మీ అబ్బాయికి ఓటెందుకెయ్యాలి భూమనా

తిరుపతి
ఆంధ్రజ్యోతి



అరాచక ముఠాల అడ్డాగా తిరుపతి

సందర్భానికి తగిన వస్త్రధారణ.. ఖణేల్‌మని మోగే గొంతు.. మాటల్లో మానవీయత.. తరచూ పుస్తకాల ప్రస్తావన.. పదేపదే గుర్తు చేసే ఎమర్జెన్సీ జైలు జీవితం.. మిలిటెంట్ ఉద్యమాల నేపథ్యం.. మఠాధిపతులకు పాద నమస్కారాలు.. విభిన్నమైన నాయకుడిగా తిరుపతి ప్రజలకు చిరపరిచితుడు భూమన కరుణాకరరెడ్డి. వైఎస్ రాజారెడ్డిని గుర్తు చేసుకుంటూ.. గురువుగా రాజశేఖర్‌రెడ్డి అండతో ఎదుగుతూ.. జగన్‌రెడ్డికి విధేయంగా ఉంటూ రాజకీయాలను బ్యాలెన్స్ చేసుకుంటున్న ఈయన.. వారసత్వ రాజకీయాలమీద నమ్మకం లేదంటూనే, తన కుమారుడు భూమన అభినయరెడ్డిని తిరుపతి శాసనసభ ఎన్నికల్లో పోటీకి దించారు. కొడుకును గెలిపించే బాధ్యత మొత్తం తన భుజాలమీద వేసుకుని ప్రచారంలో మునిగితేలుతున్నారు. అభివృద్ధి కావాలంటే అభినయ్‌కే ఓటేయాలని చెబుతున్నారు. ఇంతకీ ఈ ఐదేళ్లలో తిరుపతిలో జరిగిన అభివృద్ధి ఏమిటి...? ఆ అభివృద్ధిపై పరచుకున్న అనుమానపు నీడల్లో నిజానిజాలేమిటి.. అనే చర్చ ఎన్నికల వేళ తిరుపతి నగరంలో విస్తృతంగా జరుగుతోంది. విపక్షాలు చేస్తున్న ఆరోపణలు, విమర్శలు, సంధిస్తున్న ప్రశ్నలు, ప్రజల్లో వినిపిస్తున్న సందేహాలు.. ఇవి..

గంజాయివనం
ఎవరు కారకులు?

గతంలో భూమన కరుణాకర్‌రెడ్డి తిరుపతిని మద్యరహిత నగరంగా ప్రకటించాలంటూ మోకాటి లోతు నీళ్లలో నిరసన ప్రకటించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సంగతే ఎత్తలేదు. ఎమ్మెల్యే అయ్యాక తిరుపతిలో గంజాయి విపరీతంగా పెరిగిపోయిందంటూ వీడియో కెమెరాలు వెంటబెట్టుకుని నగర శివార్లలో పాడుబడ్డ భవనాలు, రైలు పట్టాల వెంట పరుగులు తీసి హడావుడి చేశారు. ఆతర్వాత దాన్నీ ఆయన పట్టించుకోలేదు. విశేషం ఏమిటంటే ఆయన ఎమ్మెల్యే అయ్యాకే తిరుపతిలో మద్యం విచ్చలవిడిగా పెరిగింది. నగరం గంజాయి వనంగా మారిందనే విమర్శలూ పెరిగాయి. నగరంలో గుట్కా, గంజాయి అమ్మకాలను కేంద్రీకృతం చేసి నెలనెలా భారీ మొత్తాలు దండుకుంటున్నారనే ఆరోపణలూ భూమన కుటుంబం ఎదుర్కోవాల్సి వచ్చింది. తులసివనంలాంటి తిరుపతి ఆధ్యాత్మికనగరంలో గంజాయి విశ్వరూపం చూసి ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

దొంగ ఓట్లు
వేళ్లన్నీ అభినయ్ వైపే

భారతదేశంలోనే అతి పెద్ద దొంగ ఓట్ల కుంభకోణం తిరుపతిలో జరిగింది. లోక్‌సభ ఉప ఎన్నికల్లో 34వేల ఫేక్ ఎపిక్ కార్డులను ఏకంగా ఎన్నికల వెబ్‌సైట్‌లోకే లాగిన్ అయ్యి డౌన్‌లోడ్ చేసుకున్నారని కేంద్ర ఎన్నికల సంఘమే ప్రకటించింది. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లూ బలవుతున్న ఈ కేసులో అసలు సూత్రధారి భూమన కుమారుడు అభినయరెడ్డి అని విపక్షాలు ఆరోపణ చేస్తున్నాయి. తిరుపతి ప్రతిష్ఠను తీవ్రంగా మంటగలిపిన ఉదంతంగా ఇది చరిత్రలో మిగిలిపోనుంది.

నిర్లక్ష్యం
గంగమ్మకే అపచారం

తిరుపతి ప్రజల విశ్వాసాలను కూడా గత ఐదేళ్లుగా కాలరాశారనే విమర్శలు పెరిగాయి. తిరుపతి గంగమ్మగుడి పునరుద్ధరణ పేరుతో మొత్తం గర్భగుడి సహా కూలగొట్టేసి, మూలవిరాట్‌ను గుడ్డలో చుట్టి ఆఫీసు భవనంలో పెట్టేసిన తీరు గంగమ్మ భక్తులను ఆవేదనకు గురిచేసింది. గంగ జాతర సంప్రదాయాలను కూడా మార్చేశారు. ఏ విషయంలోనూ స్థానికులను సంప్రదించలేదు. రాష్ట్ర పండుగ అంటూ జాతర నిర్వహణకు నిధులు ప్రభుత్వం నుంచి రాబట్టలేకపోయిన నాయకులు, స్థానిక వ్యాపారులను బాదేశారనే ఆరోపణలు వచ్చాయి. ఈ ఏడాది ఎన్నికల పేరులో ఏకంగా గంగజాతరనే వారం వెనక్కి నెట్టేశారు. అధికార నేతల దౌర్జన్యాలకు భయపడిన స్థానికులు ఈ అపచారాలన్నింటికీ గంగమ్మ లెక్కతేలుస్తుందని అంటుంటారు.

మాస్టర్ ప్లాన్ రోడ్లు
టీడీఆర్ బాండ్ల పేరుతో కోట్ల కుంభకోణం

మాస్టర్‌ప్లాన్ రోడ్లంటూ నగర శివార్లలో నివాసాలు కూడా లేని ప్రాంతంలో విశాలమైన రోడ్లు వేశారు. ఆగమేఘాల మీద సాగిన ఈ రోడ్ల నిర్మాణంలో టీడీఆర్ బాండ్ల పేరుతో రూ.2000 కోట్లు భూమన నొక్కేశారని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. ఎస్వీ యూనివర్శిటీనే చీలుస్తూ మూడు రోడ్లను వేయబోయిన వీరు, నగర ప్రజల వ్యతిరేకతతో వెనక్కి తగ్గాల్సివచ్చింది. కేవలం రూ.46 కోట్ల ఖర్చుతోనే 40 మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేస్తున్నామంటూ ఢంకా మోగించి చెప్పినా.. ఈ రోడ్ల భూసేకరణ పేరుతో నష్టపరిహారం కింద రూ.1013 కోట్లు టీడీఆర్ బాండ్లుగా చెల్లించారు. తిరుపతి వైసీపీ అభ్యర్థి అభినయరెడ్డి మానసపుత్రికగా ప్రకటించిన ఈ మాస్టర్‌ప్లాన్ రోడ్ల వెనుక వేల కోట్ల కుంభకోణం ఉందని వెలుగు చూడడం విశేషం.

ఈ ప్రశ్నలకు బదులేది?

? 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సుగుణమ్మ 842 ఓట్లతో విజయం సాధించారని మీడియాలో వచ్చిన తర్వాత ఏం జరిగింది. 708 ఓట్లతో ఎలా గెలిచారు.

? కార్పొరేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవాల వెనుక మీ బెదిరింపులు నిజం కాదా.

? టీటీడీ, కార్పొరేషన్ పనుల్లో పదిశాతం కమిషన్ నిజం కాదా.

? మేయర్ పదవిని బీసీలకు ఎరజూపి, డిప్యూటీ మేయర్ ముసుగులో కార్పొరేషన్‌ను గుప్పెట్లో పెట్టుకోవడం నిజం కాదా.

? టీడీపీ హయాంలో మొదలైన గరుడ వారధి పనులను కమీషన్‌ల కోసం నిలిపివేసింది నిజం కాదా.

? వీధి వీధిలో గంజాయి బ్యాచ్‌లను ప్రోత్సహిస్తున్నది వైసీపీ నాయకులు కాదా?

? 2009, 2014 ఎన్నికల్లో కడప నుంచి రౌడీలను తెప్పించి అరాచకాలను సృష్టించింది భూమన కాదా.

సౌమ్యుల పాలనలో రౌడీరాజ్యం

ఖాళీగా ఉంటే కబ్జా: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో తిరుపతిలో కడప భూ ఆక్రమణ ముఠాలు ఏవిధంగా పెచ్చుమీరిపోయాయో, అంతకుమించి జగన్‌రెడ్డి పాలనలో తిరుపతి కబ్జాకోరుల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఖరీదైన స్థలాలు ఖాళీగా ఉంటే నకిలీ పత్రాలతో ఆక్రమించడం.. లబోదిబోమని అధికారపార్టీ నాయకులకు మొర పెట్టుకుంటే..'కూర్చుని మాట్లాడుకోండి' అని సలహాలివ్వడం.. కూర్చుంటే కోట్లు డిమాండ్ చేయడం..ఇలా తిరుపతి కబ్జాకోరల్లో విలవిలలాడుతోంది. మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ సైనికులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, ప్రవాసాంధ్రుల స్థలాలను కూడా వీరు వదిలిపెట్టలేదు. వీళ్లు ఇంకో ఐదేళ్లు అధికారంలో ఉంటే తిరుపతిలో ఎవరి ఆస్తూలూ దక్కవనే భయాందోళనలు పెరిగిపోయాయి.

ముఠా మినిస్ట్రీ: నగరంలో డివిజన్‌ల వారీగా రౌడీ ముఠాలు తయారయ్యాయి. వీరికి యువనేత సారథి అని ఆరోపణలున్నాయి. తన ముఠాలో ఒక్కొక్కరికీ ఒక్కో ప్రభుత్వ విభాగాన్ని కేటాయించి అక్కడ ఏ పనులు కావాలన్నా వారి ద్వారానే జరగాలనే ఆదేశాలు అమలయ్యేలా చూస్తున్నారు. కమిషనర్ అయినా, కార్పొరేటర్లైనా, రెవెన్యూ అధికారులైనా, పోలీసులైనా వీరు చెప్పిందే జరగాలి. దీనికి యువరాజుగారి మంత్రివర్గం అనే పేరు కూడా వాడుకలోకి వచ్చేసింది.

22ఏ బాగోతం: తిరుపతిలో ఎడా పెడా భూములన్నీ హఠాత్తుగా 22ఏ నిషేధిత జాబితాలోకి వెళ్లిపోయాయి. శరణు శరణంటూ వెళ్లడమో లేదా ముడుపులతో సంతృప్తి పరచడమో చేస్తే మాత్రం ఒక్కటొక్కటిగా 22ఏ నుంచి మినహాయించారు. ఇదే తీరులో ఆర్టీసీ బస్టాండు, చింతల చేను, పెద్దకాపు వీధి ఉన్న దాదాపు 188 ఎకరాలు టీటీడీ భూములను నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను భయ భ్రాంతులకు గురిచేశారు. కొన్నిచోట్ల 22ఏ నిషేధం తొలగించి.. అంతా తమ దయతోనే జరిగిందని గొప్పలు చెప్పుకుంటున్నారు. భయపెట్టి, బెదిరించి, లొంగదీసుకునే విచిత్ర వ్యూహాన్ని అధికార పార్టీ నేతలు అవలంబిస్తున్నారు.

అలిపిరి కొండవాలునా అవినీతి: అలిపిరి నుంచి జూ పార్కు వరకు ఉన్న 2000 ఎకరాల విలువైన టీటీడీ భూముల మీద కూడా కన్నుపడింది. ఇక్కడ దేవలోక్‌కు కేటాయించిన భూమిని స్టార్ హోటల్ నిర్మాణానికి కట్టబెట్టేశారు. ఆ స్టార్ హోటల్ కోసమే యూనివర్శిటీలో అడ్డంగా రోడ్లు వేయాలనుకున్నారనే ఆరోపణలు వచ్చాయి.

బాబోయ్ ఎన్నికలా!: ప్రశాంత తిరుపతిని ప్రతి ఎన్నికల్లోనూ అశాంతిమయం చేశారు. కార్పొరేషన్ ఎన్నికలు, లోక్‌సభ ఉప ఎన్నిక, టౌన్‌బ్యాంకు, ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన తీరే ఇందుకు ఉదాహరణ. అధికారపార్టీ రౌడీరాజ్యం తిరుపతిలో ఎలా ఉందో నిరూపణ అయ్యింది. నామినేషన్లే వేయనివ్వకుండా బెదిరించడం, వినకపోతే కొట్టడం, నామినేషన్ కాగితాలు చించేయడం, ఆస్తులమీద దాడులు చేయడం.. వంటివి యథేచ్ఛగా జరిగాయి.

స్థానికులపై పగ
పెదకాపు లేఅవుట్‌లో రోడ్డు తవ్వేశారు

తిరుపతి నగరంలో గుండె వంటి ప్రాంతాలైన పెద్దకాపు లేఅవుట్, పెద్దకాపు వీధులపై భూమన కుటుంబం పగ పట్టిందనే నిందను వారు మోయాల్సి వస్తోంది. వారధి నిర్మాణం పేరుతో ఈ ప్రాంతంలోని హోటల్స్, లాడ్జీలకు దారి లేకుండా తవ్వేశారు. వారు ఇదేమి అన్యాయం అని ప్రశ్నిస్తే గత ఎన్నికల్లో తమకు ఓట్లు వేయనందుకే అని తేల్చి చెప్పారని ప్రచారం జరిగింది. కోరినంత ముడుపులిస్తే తప్ప దారి ఉండదని చెప్పడంతో ఆ ప్రాంత వాసులు ఆగ్రహాన్ని కడుపులో దాచుకుని ఉన్నారు. స్థానిక రెడ్డి సామాజికవర్గం పట్ల భూమన కుటుంబానికి కక్ష అనేందుకు ఇదే సాక్ష్యమని ప్రతిపక్ష నేతలు ఆరోపణలు చేస్తున్నారు.

ఈ ఆస్తులు ఎలా వచ్చాయి?

ఏ వ్యాపారాలూ చేయని, వ్యవసాయం చేయని భూమన కరుణాకరరెడ్డి కుటుంబం ఆస్తుల మీద కూడా ఆరోపణలున్నాయి. కేవలం ఒక జిరాక్స్ కేంద్రంలో భాగస్వామిగా ఉండే కరుణాకరరెడ్డి వందల కోట్ల ఆస్తిపరుడు ఎలా అయ్యాడని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తూ ఉంటాయి. ఆయన అధికారం అడ్డం పెట్టుకుని ఆస్తులు సంపాదించాడంటూ, అందుకు సాక్ష్యంగా కొన్ని ఉదంతాలు చూపిస్తుంటాయి.

- కరుణాకర రెడ్డి తుడా ఛైర్మన్‌గా ఉన్న సమయంలో (2005-06) అభినయ్ రెడ్డి పేరిట 21 సార్లు ఆస్తులు కొనుగోలు జరిగాయి. వడమాల పేట మండలం ఎస్వీపురం వద్ద 5.84 ఎకరాలు (ప్రస్తుతం టీటీడీ ఉద్యోగులకు ఇంటిస్థలాలు ఇచ్చిన ప్రాంతం), సూరప్పకశం టౌన్‌షిప్ సమీపంలోని గాజులమండ్యంలో 13.82 ఎకరాలు కలిపి మొత్తంగా 19.66 ఎకరాల భూమిని తుడా ఛైర్మన్‌గా ఉన్నప్పుడే కుమారుడు అభినయరెడ్డి పేరిట ఆస్తులు కొనుగోలు జరిగింది.
- టీటీడీ ఛైర్మన్ అయ్యాక (2007-08)లో మూడు కొనుగోళ్లు జరిగాయి. 2008లో తిరుపతి రూరల్ కొత్తూరు దగ్గర 1.37 ఎకరాల స్థలం అభినయ్ పేరిట కొనుగోలు జరిగింది. తిరుచానూరు గ్రామ లెక్కదాఖలాలో రెండు ఎకరాలు (సర్వే 473/4) 2021లో కరోనా సమయంలో సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే నివాసం ఉంటున్న పద్మావతిపురంలో 2011లోనే నాలుగు చోట్ల రెసిడెన్షియల్ ఆస్తులను కొనుగోలు చేశారు. 2008లో హైదరాబాదులో 2225 చ.అడుగులు కలిగిన ఓ రెసిడెన్షియల్ బిల్డింగ్ అభినయ్ ఆస్తుల ఖాతాలో ఉంది. ఇక భార్య పేరిట 2011లో (సెజ్ సమీపంలో) వరదయ్యపాళం, పాండూరు దగ్గర- 28 ఎకరాల భూమి గిఫ్ట్ డీడ్ వచ్చింది.




రోజమ్మ కలిపింది అందరినీ...

నగరి నియోజకవర్గంలో నాయకులంతా ఏకమవుతున్నారు. ఇదేదో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రోజా రాజకీయ చతురత, నాయకత్వ పటిమతోనే సాధ్యమైందనుకుంటే పొరబడినట్టే. దశాబ్దాలుగా రాజకీయ ప్రత్యర్థి వర్గాలుగా కొనసాగుతున్న నేతలంతా ఇప్పుడు రోజా ఓటమి కోసం చెట్టాపట్టాలేసుకుంటున్నారు. నిండ్ర మండలంలో రెడ్డివారి కుటుంబం ఏళ్ల తరబడి టీడీపీతో పోరాటం చేసింది. ఐదేళ్లుగా రోజా వ్యవహారశైలితో విసుగు చెందిన శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. విజయపురం లక్ష్మీపతిరాజు ఇదే తీరున టీడీపీ గూటికి చేరారు. పుత్తూరులో డీఎన్ ఏలుమలై కుటుంబం టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీతో హోరాహోరీగా తలపడినా రోజా తీరు నచ్చక గత నెలలో టీడీపీలో చేరారు. వడమాలపేట జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి 2014,2019లో వైసీపీకి బలంగా పనిచేశారు. టీడీపీతో ఢీ అంటే ఢీ అనే స్థాయిలో రాజకీయాలు నెరిపారు. వైసీపీలో ఉక్కబోతను భరించలేక టీడీపీ కండువా కప్పుకున్నారు. కొసమెరుపు ఏంటంటే చాన్నాళ్లుగా వైరి వర్గాలుగా వ్యవహరించిన ఈ నాయకులంతా కొద్దిరోజులుగా సహాయ సహకారాలు అందించుకుంటున్నారు. గాలి భానుప్రకాష్ గెలుపు కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. రోజా ఓటమే సింగిల్ పాయింట్ ఎజెండాగా వీరు పనిచేస్తున్నారు. - పుత్తూరు అర్బన్

'ఫ్యాను' ప్లాను బెడిసికొడుతోంది...

తమ వ్యూహాలు ప్రత్యర్థి పార్టీ వారికి తెలిసిపోతున్నాయని మండల వైసీపీ శిబిరం కలవరపడుతోంది. తామేం చేయబోతున్నామో టీడీపీ వారు ముందుగా పసిగట్టేస్తున్నారని తలపట్టుకుంటోంది. ఐదేళ్లక్రితం ముఖ్య ప్రజాప్రతినిధి విజయానికి వైసీపీలో చాలామంది నాయకులు,కార్యకర్తలు చెమటోడ్చి పనిచేశారు. పార్టీయే సర్వస్వమని భావించి జెండా మోశారు. అధికారం వచ్చాక సదరు ముఖ్య ప్రతినిధి వీరందరినీ పట్టించుకోవడం మానేశారు. తనకు నచ్చిన వారితో కోటరీ ఏర్పరుచుకున్నారు. పార్టీ కోసం కష్టించి పనిచేసిన వారిలో సింహభాగం వైసీపీకి గుడ్ బై చెప్పేశారు. టీడీపీలో చేరిపోయిన వీరంతా ఇప్పుడు అక్కడ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ పరిణామం వైసీపీ నాయకుల్లో గుబులు రేపుతోంది. వార్డుల్లో తామేం చేయబోతున్నామో టీడీపీ నేతలకు తెలిసిపోతోందని ఆందోళన చెందుతున్నారు. పార్టీ వీడిన వారి వల్లే ఇలా జరుగుతోందని భావిస్తున్నారు. తమ ఆనుపానుల గురించి బాగా తెలియడంతో వ్యూహాలు లీక్ అవుతున్నాయని గ్రహించారు. ఎన్నికల్లో డబ్బుల పంపిణీ,పోల్ మేనేజిమెంట్ లాంటి కీలక పద్ధతులు కూడా ఎలా జరుగుతాయో టీడీపీ శిబిరానికి తెలుస్తుండటంతో వైసీపీ ముఖ్య నాయకులకు ఏం చేయాలో పాలుపోవడంలేదు. - రేణిగుంట



మందుబాబుల అల్టిమేటం



డబ్బులిచ్చినా.. మందు పోయిస్తేనే ప్రచారానికి వస్తామని కొందరు తెగేసి చెబుతుంటే వారికి నచ్చజెప్పడానికి పార్టీల నాయకులు నానాతంటాలు పడుతున్నారు. ఒక అడుగు ముందుకేసి మద్యం లేకుంటే తమను ప్రచారానికి పిలవద్దంటూ అల్టిమేటం జారీ చేస్తున్నారు. అడిగినంత మందు దొరకడంలేదబ్బా....ఎక్కడ నుంచి తీసుకొచ్చి ఇవ్వాలంటూ సర్దిచెబుతున్నా మందుబాబులు వినడంలేదు. వీరి మొండిపట్టుతో తిరుపతిలోని పార్టీల వార్డు బాధ్యులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. శనివారం వరకూ వీరిని కాపాడుకునేందుకు కాళ్లావేళ్లాపడి బతిమలాడుకుంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధించడం సమస్యగా మారింది. ఏదోలా మద్యం దుకాణాలను మేనేజ్ చేద్దామన్నా కుదరడం లేదు. పరిమితికి మించి అమ్మితే ఫ్లయింగ్ స్క్వాడ్ కేసులు పెడుతోందని షాపుల వారు జంకుతున్నారు. ఇప్పటికే 12 మందిని తీసేశారు..ఎక్కువ మందు ఇవ్వడం తమవల్ల కాదంటున్నారు. చేసేదిలేక తమిళనాడు నుంచి చీప్ లిక్కర్ తీసుకొచ్చి అడ్డదారుల్లో పంపిణీ చేస్తున్నారు. తిరుపతి నగరంలోని చాలా వార్డుల్లో ఈ తలనొప్పి సన్నివేశాలు కనిపిస్తున్నాయి.
-తిరుపతి(నేరవిభాగం)

క్యాంపస్ సెలక్షన్లు కనుమరుగు

నేను సైతం



మాది ఏర్పేడు మండలం కొత్త కాల్వ గ్రామం. నాన్న నాదముని రెడ్డి సన్నకారు రైతు. ఆ రోజుల్లో రాష్ట్రంలో చదువుకున్న యువతకు ఉద్యోగాలు వచ్చేవి కావు. 1999లో చంద్రబాబు నాయుడు సీఎం అయ్యారు. ఆయన ముందు చూపుతో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయడానికి చాలా కృషి చేశారు. చంద్రబాబు చొరవతో ఆ రంగం వేళ్లూనుకుని చాలా మందికి బతుకు దారి చూపించింది. ఆయన సమర్థ నాయకత్వంపై నమ్మకంతో మానాన్న నన్ను 2001లో ఇంజినీరింగ్ చదివించారు. చెన్నైలో నెలకు రూ.1.5 లక్షల జీతం వస్తోంది. ఆనాడు చంద్రబాబు చేసిన అభివృద్ధి ఫలితంగా నా కుటుంబం పేదరికాన్ని జయించింది. అయితే గడచిన ఐదేళ్లుగా వైసీపీ పాలనలో శ్రీకాళహస్తితోపాటు రాష్ట్రం పరిస్థితి దారుణంగా మారిపోయింది. చదువుకున్న యువత ఉద్యోగాలు లేక దారి తప్పుతున్నారు. స్కూల్ పిల్లల సైతం మద్యం తాగుతున్నారని తెలుసుకుంటే బాధ, భవిష్యత్ మీద ఆందోళన కలుగుతున్నాయి. గంజాయి, డ్రగ్స్ వినియోగం పెరిగిపోయింది. ఐదేళ్ల నుంచి పేరున్న కాలేజీల్లో సైతం క్యాంపస్ సెలక్షన్లు నిలిచిపోయాయి. ఎంపికకు రావడానికి కంపెనీలు భయపడిపోతున్నాయి. నాణ్యమైన సాంకేతిక విద్య కోసం విద్యార్థులు పక్క రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారు. ఇలాంటి పరిస్థితులు గాడిన పడాలంటే చంద్రబాబును మళ్లీ గెలిపించుకోవాలి. ఆయన సీఎం అయితే తప్ప రాష్ట్రం బాగుపడదు.. అందుకే సెలవు పెట్టి వచ్చి ప్రచారంలో పాల్గొంటున్నాను. టీడీపీ అధికారంలోకి రావలసిన అవసరం గురించి వివరిస్తున్నాను.

- లోకేష్ కుమార్

-శ్రీకాళహస్తి

ఆ వాహనమే గెలిపిస్తోందా...

సెంటిమెంట్

రాజకీయ నాయకుల్లో చాలామంది సెంట్‌మెంట్లను గట్టిగా నమ్ముతారు. కొందరికి ముహూర్తాలు, మరికొందరు దైవ దర్శనం .. ఇలా రకరకాల సెంట్‌మెంట్లను పాటిస్తుంటారు. మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు పరసారత్నం తాను మొదట పోటీ చేసిన సమయంలో ఉపయోగించిన అంబాసిడర్ కారునే ఎన్నో ఎన్నికలకు వాడారు. ఆ వాహనం నంబరు 1234. కార్లు మారినా ఆ నంబరును మాత్రం ఆయన వదులుకోడానికి ఇష్టపడరు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్యకు కూడా వాహన నంబరు సెంటిమెంటెక్కువే. 9వ నంబరు ప్లేటుండే కారునే వాడుతుంటారు. రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి ఈ నంబరున్న బ్లాక్ కలర్ ఇన్నోవాలోనే వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఖచ్చితంగా ఈ వాహనంలోనే ప్రయాణిస్తారు. ఈసారీ అదే సెంటిమెంట్ ఫాలో అవుతున్నారు. - తడ


మాజీ మంత్రి పరసారత్నం వాడుతున్న ఇన్నోవా

నమ్మకస్తుల కోసం వేట

ఎన్నికలు దగ్గరకొచ్చేశాయి. ప్రచారం గడువూ ముగిసిపోతోంది. దీంతో నగదు పంపిణీపై కీలక నాయకులు దృష్టి పెట్టారు. ఇందులో పాత్ర పోషించే అత్యంత నమ్మకమైన వారి కోసం నాయకులు ఆరా తీస్తున్నారు. గత ఎన్నికల్లో పనిచేసిన వారి గుణగణాలను తెలుసుకుంటున్నారు. డబ్బులు నొక్కేస్తారనుకున్నవారిని దూరం పెడుతున్నారు. ప్రాంతాల వారీగా పంపిణీ చేయాల్సిన మొత్తంపై లెక్కలేయడంలో తలమునకలై ఉన్నారు. ఓటర్లందరికీ ఒకే తీరుగా కాకుండా కేటగిరీలుగా విభజించి పంచాలని వీరు భావిస్తున్నట్లు సమాచారం. ఖచ్చితంగా తమకు అనుకూలంగా వేసేవారు, డబ్బులిస్తేనే ఓటేస్తారనుకునేవారు, ఇచ్చినా ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి ఓటేస్తారనుకునేవారు.. ఇలా కేటగిరిల వారీగా ఎవరెవరు ఎంతమంది ఉంటారనే కోణంలో అభ్యర్థులు లెక్కలతో కుస్తీ పడుతున్నారు. కొందరు చోటామోటా నాయకులు ఇప్పటికే అభ్యర్థుల సన్నిహితులను సంప్రదించడం మొదలెట్టారు. తమ చేతిలో ఇన్ని ఓట్లున్నాయంటూ బేరాలకు దిగుతున్నారు. వీరిలో ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో ముఖ్య నేతలు తెలియక తలపట్టుకుంటున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ తరహా సంఘటనలు జరుగుతున్నాయని సమాచారం. గెలుపు ఓటములను ప్రభావితం చేసే నగదు పంపిణీ విషయంలో నేతలు ఆచితూచి వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది.
-తిరుపతి(ఆంధ్రజ్యోతి)



శ్రీకాళహస్తిలో రౌడీయిజం నెల రోజుల్లో అంతం

టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి



నెల రోజుల్లోనే శ్రీకాళహస్తిలో రౌడీయిజం అనే మాట వినపడకుండా చేయాలనుకుంటున్నట్లు టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి చెప్పారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రౌడీయిజంతో ప్రజలు భయం భయంగా గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న వ్యాపారులు, ప్రజలు బొజ్జల కుటుంబంపై నమ్మకంతో విశేష ఆదరణ చూపుతున్నారన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని తాను తపన పడుతున్నానన్నారు. తాను గెలిచాక చేపట్టబోయే అభివృద్ధి ప్రణాళిక గురించి ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆయన పంచుకున్నారు.

- శ్రీకాళహస్తి

ఓటు వినియోగం గోప్యం

మీకు నచ్చిన వారికి స్వేచ్ఛగా మీ ఓటును వేసుకోవచ్చు. మీ ఓటు ఎవరికి వేశారో ఎవ్వరూ కనుక్కోలేరు. ఇది అసంభవం. శ్రీకాళహస్తిలో కొందరు వైసీపీ నేతలు ప్రజలను పరోక్షంగా బెదిరిస్తున్నారు. పోలింగ్ కేంద్రంలో మీరు ఎవరికి ఓటు వేస్తారు మాకు తెలిసిపోతుంది అంటూ ప్రచారం చేస్తున్నారు. మాకు ఓటు వేయకపోతే తర్వాత మీ పథకాలు రద్దు చేస్తామంటూ కొన్నిచోట్ల గ్రామీణ ప్రజలను బెదిరిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటు వేసిన వారికితప్ప మరొకరు తెలుసుకునే అవకాశం ఉండదు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి నన్ను ఎమ్మెల్యే గెలిపించి శ్రీకాళహస్తికి అభివృద్ధికి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరుతునా.

యువత కోసం అధునాతన వ్యవస్థలు

ముక్కంటి ఆలయ పాలకమండలి సభ్యుడిగా ప్రజా జీవితం ప్రారంభించిన బొజ్జల గోపాలకృష్ణారెడ్డిని ఐదుసార్లు ఎమ్మెల్యేగా శ్రీకాళహస్తి ప్రజలు ఆదరించారు. ఆయన మూడుసార్లు మంత్రిగా పనిచేసి పుణ్యక్షేత్రంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడంతో పాటు అభివృద్ధే ఎజెండాగా సాగి జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.అలాంటి నియోజకవర్గంలో ఐదేళ్లుగా అభివృద్ధి జాడే లేకుండా పోయింది.మేం అధికారంలోకి వచ్చాక యువత అభివృద్ధి కోసం అధునాతన వ్యవస్థలకు శ్రీకారం చుట్టబోతున్నాం. నియోజకవర్గంలో రెండు చోట్ల నైపుణ్య అభివృద్ధి కేంద్రాలను నెలకొల్పుతాం. అలాగే పారిశ్రామికవేత్తలకు అన్ని రకాల ప్రోత్సాహకాలు కల్పిస్తాం. స్థానిక యువతకు పరిశ్రమల్లో 33 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేస్తాం. ఇప్పటికే నియోజకవర్గంలో నిరుద్యోగ యువతను గుర్తించి వారికి భరోసా ఇచ్చాను. అన్ని పంచాయతీల్లో యువత కోసం ప్రత్యేక ఆన్లైన్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నాం. నగరాలకు వెళ్లి ట్రైనింగ్ తీసుకోలేని విద్యార్థులు, నిరుద్యోగులు ఆన్లైన్ కేంద్రాల ద్వారా ఉచితంగా శిక్షణ పొందవచ్చు. ఇక్కడి నుంచి ఉద్యోగ అవకాశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇలా చాలా కొత్త విధానంతో ముందుకు నడవాలన్న విజన్‌తో ముందుకు సాగుతున్నాను.

కన్నలి కాలువకు మోక్షం

పట్టణంలో నిరుపేద కాలనీల ప్రజలు కన్నలి కాలువ అభివృద్ధి కోసం నిరీక్షిస్తున్నారు. ఈ కాలువ పరిస్థితి చూస్తే నా మనసు చలించిపోయింది. కాలువను పూర్తిగా అభివృద్ధి చేసి, పైన స్లాబ్ వేయడంతో పాటు ఆహ్లాదకరమైన వాకింగ్ ట్రాక్టర్‌గా మార్చాలని సంకల్పించాను. ఇక నియోజకవర్గంలో ఓపెన్ డ్రైనేజీ సిస్టంను క్లోస్ విధానంలోకి మార్చాలి. స్వర్ణముఖి నది ఆనకట్టలు... తాగుబోతులు, గంజాయి సేవించే వారికి అడ్డాలుగా మారిపోయాయి. వాటిని కూడా పూర్తి ఆహ్లాదకరంగా మార్చి చరిత్రలో నిలిచిపోయేలా చేస్తాను. గెలిచిన 8 నెలల్లోగా ఎన్టీఆర్ గృహాలను లబ్ధిదారులకు పంచి కాలనీ కళకళలాడేలా చేస్తానని హామీ ఇచ్చాను.

ల్యాండ్ టైటిల్ చట్టం ఎందుకు?

ప్రజలు ఒక విభాగంలో ఏ రకమైన సమస్య ఎదుర్కొంటున్నారో గుర్తించాలి. అది అధిగమించేందుకు అవసరమైన సంస్కరణ చేయాలి. ఆస్తులు, భూములకు పత్రాలు ఇవ్వకుండా ఆన్లైన్లో పెడతామంటున్నారు. ఆన్లైన్లో వివరాలు తారుమారైతే...? కడుపు కట్టుకొని పైసా పైసా కూడపెట్టుకుని స్థలం కొనుగోలు చేస్తే వాటికి భద్రత లేకుండా చేస్తారా. పత్రాలు చేతిలో లేకపోతే భూముల యజమానులు ఆపద సమయంలో అమ్ముకోవాల్సి వచ్చినా, రుణం తీసుకోవాల్సి వచ్చినా ఏం చేయాలి...? దీనిని ప్రజలు ఎవరూ ఉపేక్షించే పరిస్థితి లేదు. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఈ చట్టాన్ని సీఎంగా చంద్రబాబు రద్దు చేస్తారు.

డీకేటీ భూముల్లో భారీ స్కాం

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో డీకేటీ భూములను రిజిస్ట్రేషన్‌లో భారీ స్కాం జరిగింది. 20 ఏళ్ల గడిచిన డీకేటీ పట్టాలను పథకం ప్రకారం ఎమ్మెల్యే మధు, ఆయన అనుచరులు గుర్తించారు. అనేక రకాలుగా బెదిరించి బలవంతంగా భూములను విక్రయించేలా చేశారు. బినామీ పేర్లతో కొనుగోలు చేసి విక్రయాలు చేస్తున్నారు. వందల ఎకరాల డీకేటీ భూముల రికార్డులను తారుమారు చేశారు. ఈ తతంగం వెనుక పెద్ద భూ మాఫియా నడిచింది. పలుచోట్ల అన్నదాతల కడుపు మంటను పెట్టుకున్నారు. వందల ఎకరాల డీకేటీ భూముల రికార్డులను తారుమారు చేశారు. ఫిర్యాదు చేసిన ప్రజలకు న్యాయం చేయాలి.

ఇళ్లనూ కొల్లగొట్టేస్తారు

శ్రీకాళహస్తిలో జరిగినంత అవినీతి ఎక్కడా జరగలేదు. ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అవినీతిలో నంబర్ వన్‌గా నిలిచారు. సరికొత్త అవినీతి మార్గాలను ఆయన అనుసరించారు. ఎక్కడైనా ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టే వారిని చూసి ఉంటాం. సొంత పార్టీ వారిపై కూడా పైశాచికంగా దాడులు చేయించి కీచక నైజం ప్రదర్శించాడు. ప్రశ్నించిన ప్రత్యర్థులను అయితే ఇష్టారాజ్యాంగా తప్పుడు కేసులతో వేధించారు. మద్యం, సాండ్, ల్యాండ్, గ్రావెల్, మట్టి, లాటరీ టిక్కెట్లు, మట్కా, మాఫియాలను స్వయంగా ఆయనే నడిపించారు. ప్రతి కాంట్రాక్టులోనూ కమీషన్. ఆయన అవినీతికి పాల్పడని అంశమే లేదు. ఒక్క అవకాశం ఇచ్చినందుకే ఇంతలా రెచ్చిపోయారు. మరోసారి గెలిస్తే ప్రజలను ఇళ్లలో కూడా బతకనివ్వకుండా కొల్లగొట్టేస్తారు.

సెంట్రల్ మానిటరింగ్ సిస్టంతో అభివృద్ధి

ముక్కంటి ఆలయంలో అవినీతి విలయ తాండవం చేస్తోంది. మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ముక్కంటి ఆలయంలో రాహు-కేతు పూజలకు శ్రీకారం చుట్టి ప్రపంచ ప్రసిద్ధి చెందేలా చేశారు. ఈ రోజు రాహు- కేతు పూజల్లో కోట్ల రూపాయల అవినీతిని సాగిస్తున్నారు. ఆలయంలో విధులు కేటాయించేందుకు ఉద్యోగుల నుంచి ముడుపులు వసూలు చేస్తున్నారు. ఆలయంలో సెంట్రల్ మానిటరింగ్ సిస్టం అమలు చేసి ఎక్కడా అవినీతికి తావు లేకుండా పటిష్టమైన వ్యవస్థను నెలకొల్పుతాం. మాస్టర్ ప్లాన్ అనేది నాన్న కల. ఇందుకోసం ఆయన ఎంతో తపన పడ్డారు. సన్నిధి వీధి ప్రజలు ఆయన పిలుపుతో స్వచ్ఛందంగా భూములు అప్పగించారు. వారి త్యాగాలు వృథా కాకూడదు. వైసీపీ పాలకులు ఐదేళ్లలో పూర్తిగా విస్మరించారు.

మైనారిటీల మమకారం మరువలేం

నియోజకవర్గంలో మైనారిటీలు టీడీపీని విశేషంగా ఆదరిస్తారు. నాన్న ఐదుసార్లు గెలవడంలో మైనారిటీలది కీలక పాత్ర. నాన్న మైనారిటీల కోసం ఈద్గాలు, షాదీ ఖానాలు, శంషాన్ ఘాట్‌లు, వాటికి పరిహారీలు ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాటు చేశారు. రూ.150 కోట్లు విలువైన ఆస్తులను కేటాయించారు. మైనారిటీలు దశాబ్దాల నుంచి బొజ్జల కుటుంబాన్ని గుండెల్లో మోస్తున్నారు. వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేం. చంద్రబాబు అమలు చేసిన దుల్హన్, షాదీ ముబారక్, రంజాన్ తోఫా పథకాలు ప్రజలకు మరింత చేరువయ్యాయి. నేను గెలిచిన తర్వాత మైనారిటీల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తాను.

వెండి చోరీపై విచారణ ఏది?

దేశంలోనే ప్రముఖ శైవక్షేత్రంలో ఎమ్మెల్యే మధు వెండి చోరీ చేసి అమ్మేశారని పెద్ద ఎత్తున దుమారం రేగింది. స్వయానా ఆయన అనుచరుడిగా కొనసాగిన హేమచంద్రారెడ్డే తన చేతుల మీదుగా ముక్కంటి ఆలయం నుంచి వెండిని తీసుకెళ్లి బెంగళూరులో అప్పగించానని మీడియా ఎదుట చెప్పాడు. బెంగళూరుకు చెందిన మహిళ ఖాతా నుంచి తన ఖాతాకు రూ.10 లక్షలు బదిలీ అయినట్లు పక్కా వివరాలను వెల్లడించాడు. అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. కరోనా సమయంలో మద్యం దుకాణాలను లూటీ చేసి పదింతలు అధిక ధరకు అమ్ముకున్నట్లు వెల్లడించాడు. ఇంతటి తీవ్రస్థాయి ఆరోపణలు వస్తే ఏ ఒక్క అధికారి కూడా ఎందుకు నోరు మెదపడం లేదు. నేను ముందు నుంచి చెబుతూనే ఉన్నాను. ఎమ్మెల్యే మధు ఆయన బ్యాచ్ కలిసి ఆలయాల జీర్ణోద్ధరణ పేరుతో గూడుపుఠాణి చేస్తున్నారని. అనుబంధంగా ఉన్న ఒక ఆలయంలో మూల



మూర్తి కింద భాగంలో పురాతన నాణాలను మాయం చేశారని నేను సంవత్సరం క్రితమే చెప్పాను. ఇప్పుడు స్వయంగా ఆయన అనుచరుడే వెండి దోపిడీపై బయటకు వచ్చాడు. అయినా పట్టించుకునే వారే కరువయ్యారు. శివుడే ఆయన ఆయన ఆస్తులను కాపాడుకుంటాడన్న విశ్వాసం ఉంది.

18 అక్రమ కేసులు బలయించారు

నేను నాన్ లోకల్ అని... వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారు. నేను నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజలు తరఫున పోరాడాను. 2019 ఎన్నికల నామినేషన్ అఫిడవిట్ ఆన్లైన్‌లో ఉంది. అప్పటికి నాపై ఒక్క కేసు కూడా లేదు. ఈ ఐదేళ్లలో 18 కేసులు నాపై అక్రమంగా బనాయించారు. నేను శ్రీకాళహస్తిలో లేకపోతే ఇన్ని కేసులు ఎలా వచ్చాయి. చదువు కోసం హైదరాబాదు, అమెరికాలో ఉన్నాను. ఐదేళ్ల నుంచి ప్రజా జీవితంలోకి వచ్చాను. ప్రజలకు అన్నివేళలా సమస్యల్లో అండగా నిలుస్తున్నాను. ఐదేళ్ల రాక్షస పాలన చూసి ప్రజలు విసుగు చెందారు. నేను గెలిచిన తర్వాత పండగ వాతావరణం రాబోతుంది. ప్రజలు ఒక్క అవకాశం ఇస్తే నాన్న తరహాలోని మళ్లీ మళ్లీ ప్రజలు ఆదరించేలా పాలన సాగిస్తాను.

సీపీఐ అభ్యర్థి మురళిని గెలిపించండి



మీడియాతో మాట్లాడుతున్న నారాయణతో సీపీఐ నేతలు

తిరుపతి(ఆటోనగర్)మే 9 :నిత్యం ప్రజల్లో వుండే తిరుపతి సీపీఐ అభ్యర్థి పి.మురళిని గెలిపించాలని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విజ్ఞప్తి చేశారు. తిరుపతి సీపీఐ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు.తిరుపతిలో వైసీపీ,టీడీపీ నేతలు పట్టపగలు డబ్బులు పంపిణీ చేస్తున్నప్పటికీ పట్టుకోకుండా ఎన్నికల అధికారులు ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.నగరిలో రోజాను జాతరలో గంగమ్మను ప్రజలు సాగనంపేవిధంగా ఓడించి పంపుతారని చెప్పారు.రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీని ఓడించాలని నారాయణ విజ్ఞప్తి చేశారు. మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడుతూ ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ప్రయత్నిసున్నారని దుయ్యబట్టారు.ఒక పార్టీలో గెలిచి మరోపార్టీలో చేరి మంత్రి పదవులు అనుభవిస్తున్న వారి పట్ల ఎన్నికల కమిషన్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.సీపీఐ అభ్యర్థి పి.మురళి, నాయకులు పి.హరినాదరెడ్డి,ఎ.రామానాయుడు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దేవేరికి శఠారి కానుక



తిరుచానూరు, మే 9: తిరుమల శ్రీవారి దేవేరి అయిన తిరుచానూరు పద్మావతీ దేవికి వైజాగ్‌కు చెందిన మస్తాన్‌రావు 425 గ్రాముల బంగారు శఠారిని గురువారం అందజేశారు. రూ.25లక్షల విలువ చేసే ఈ శఠారిని డిప్యూటీ ఈవో గోవిందరాజన్ ఆలయం తరఫున అందుకున్నారు.

గోవిందరాజ స్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుపతి(కల్చరల్) మే 9: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఆలయంలో మే 16 నుంచి 24వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఆలయాన్ని సంప్రదాయరీతిలో వివిధ పరిమళద్రవ్యాలతో శుద్ధిచేశారు. ఉదయం 6.30 గంటల నుంచి 9.30 వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. 10 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో చిన్నజీయరు స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, అర్చక బృందం పాల్గొన్నారు.

ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కల్చరల్), మే 9: తిరుపతిలో టీటీడీకి చెందిన ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, నాదస్వర పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి ప్రవేశానికి ఈనెల 25వ తేదినుంచి దరఖాస్తులు ఇవ్వనున్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 12వ తేదీలోగా కళాశాలలో అందజేయాలని టీటీడీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సంగీత, నృత్య కళాశాలలో.. గాత్రం, వయోలిన్, వీణ, ఫ్లూట్, నాదస్వరం, భరత నాట్యం, హరికథ, మృదంగం, డోలు, ఘటం విభాగాల్లో విశారద(ఫుల్‌టైం), ప్రవీణ (డిప్లొమో) కోర్సులున్నాయి.

నాదస్వర, డోలు పాఠశాలలో..

నాదస్వర, డోలు పాఠశాలలో ఫుల్ టైం సర్టిఫికెట్, డిప్లొమో కోర్సులున్నాయి. బయటి ప్రాంత విద్యార్థులకు హాస్టల్ వసతి ఉంది. కళాశాలలో రూ.50 చెల్లించి దరఖాస్తు పొందవచ్చు. పూర్తి వివరాలకు 0877-2264597, 73308 11173, 98483 74408, 94407 93205 నెంబర్లను సంప్రదించాలి.

14 నుంచి చిత్తూరు గంగజాతర



మీడియాతో మాట్లాడుతున్న ఉత్సవ ధర్మకర్తలు

చిత్తూరు కల్చరల్, మే 9: నగరంలో ఈ నెల 14 నుంచి 22వ తేదీ వరకు చిత్తూరు నడివీధి గంగమ్మజాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ వంశపారంపర్య ధర్మకర్తలు సీకే లావణ్యబాబు తెలిపారు. గురువారం తన నివాసంలో ఉత్సవ నిర్వాహకులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడుతూ 14న చాటింపు, 15 నుంచి 20 వరకు అమ్మవారికి భక్తులు పొంగళ్లు, తోటివేషాలు, దీపారాధనలు ఉంటాయని వివరించారు. ఎన్నికల కారణంగా ఈ సంవత్సరం జాతరను 21, 22 తేదీలకు మార్చామని వెల్లడించారు. ఈ సమావేశంలో గుణశేఖర్, వెంకటేష్, హేమంత్‌కుమార్, సత్య పొన్నియమ్మగుడి అర్చకులు కేదారేశ్వర స్వామి పాల్గొన్నారు.

ఇలా అయితే.. ఎలా?

ఎస్వీయూ హెల్త్ సెంటర్‌లో వీసీ తనిఖీలు

సిబ్బంది గైర్హాజరుపై వివరణ ఇవ్వాలని ఆదేశాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 9: విద్యార్థులు, ఉద్యోగులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అందుబాటులో ఉండాల్సిన హెల్త్ సెంటర్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే ఎలా? అని ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. యూనివర్సిటీ ఆరోగ్య కేంద్రంలో గురువారం ఉదయం వీసీ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఉదయం 8 గంటల నుంచే విధి నిర్వహణకు సిబ్బంది హాజరు కావలసి ఉండగా, 8.45 గంటలు అయినా ఒకరిద్దరు మినహా సిబ్బంది ఎవ్వరూ అందుబాటులో లేకపోవడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. మెడికల్ షాపు, ల్యాబ్, నర్సింగ్ వంటి సెక్షన్లకు సంబంధించిన 22 మంది సిబ్బంది విధులకు హాజరు కాకపోవడం ఏమిటని అక్కడున్న సిబ్బందిని ప్రశ్నించారు. ఈ పరిస్థితి మారకపోతే చర్యలు తప్పవని వీసీ స్పష్టం చేశారు. గైర్హాజరుపై ఉద్యోగులు వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

13న కార్మికులకు సెలవు

తిరుపతి(ఆటోనగర్), మే 9: రాష్ట్రంలో ఈ నెల 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కార్మికులు ఓటు హక్కును వినియోగించుకోవడానికి ప్రభుత్వం సెలవు ప్రకటించిందని ఉపకార్మిక కమిషనర్ బాలూనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు, పరిశ్రమలు, ఇతర ప్రైవేటు సంస్థల యజమానులు ఈ ఆదేశాలను అమలుచేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించిన యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

10 నుంచి రామానుజ అవతార ఉత్సవాలు

తిరుపతి(కల్చరల్), మే 9: ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు భగవద్ రామానుజాచార్య అవతార మహోత్సవాలను నిర్వహించనున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక అన్నమాచార్య కళామందిరంలో నిర్వహించే ఈ ఉత్సవాల్లో ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 8.30 వరకు సాహిత్య, సంగీత సభలు జరుగుతాయి. తొలి రోజు మే 10న సాయంత్రం 5.30 గంటలకు తిరుమల పెద్దజీయరు స్వామి, చినజీయరు స్వామి మంగళాశాసనంతో కార్యక్రమం మొదలవుతుంది. అనంతరం తిరుపతికి చెందిన ఆచార్య చక్రవర్తి రంగనాదన్.. రామానుజ వైభవంపై ప్రసంగిస్తారు. తరువాత రేవతి బృందం భక్తి సంగీత విభావరి ఉంటుంది.

● అట్టుంటది మాతోని

మీకెట్టా ఇస్తారో నేను జూడనా!



'నీకిచ్చినారా.. అయితే మేమేం జేసినాం? నీగ్గూడా ఎట్టా దక్కతాదో జూస్తాం..' అంటా రగిలిపోతా వుండారు కుప్పం ఓటర్లు. 'నాకు దక్కకుంటే పీడాపాయ. నీకుమాత్రం దక్కనియ్యనుగాక.. దక్కనియ్యను' అని శపథం చేసి మరీ తీసుకున్నోల్లను, అధికార పార్టీవోల్లను రచ్చకీడస్తావుండారు. బుదారం రేత్తిరి కుప్పం మున్సిపాలిటీలో అధికార పార్టీవోల్లు ఓటర్లకు తలా నాలుగు ఎయ్యిలు పంచకుంటా వొచ్చినారు. అదీ ఓల్లకు అనుకూలమైన యాపై శాతం మందికే పంచాలని పెద్ద నాయకులు రూలు పెట్టినారంట. అందుకని ఒకింటికి పంచితే, ఆ పక్కింటికి కాసులు అందలా. ఒకాయమ్మ ఒడిలో కాసులు నిండితే, ఇంకొకాయమ్మకు ఒట్టిచెయ్యి చూపతా వొచ్చినారంట. అంతా బాగానే జరిగింది కానీ, బైరుగానిపల్లి దెగ్గిరికి వొచ్చేసరికి ఈ యాపై శాతం మందికి పంపిణీ కత తిరగబడింది. అక్కడ ఒకే కుటుంబరానికి చెందిన మూడునాలుగుమంది మనుషులు పెళ్లిళ్లు పేరంటాళ్లు చేసుకోని ఏరేపొయ్యి మూడునాలుగు ఇళ్లల్లో కాపురాలు జేస్తావుండారంట. ఆ ఇళ్లల్లో ఒకింటికాడికి ఎల్లిన అధికార పార్టీ మనుషులు, ఓటరుకు నాలుగు ఎయ్యిలు వొంతున కాసులు పంచినారంట. ఆ పక్కింటోల్లు చూస్తానే ఉండారుగానీ, ఒక్క పైసా గూడా ఇదల్చలేదంట. అప్పటికీ ఆ ఇంటోల్లు నోరిడిసి అడిగినారంట గూడా.. 'మాకేయి సామీ కాసుల'ని. 'లేదు.. మీకిచ్చేకి మావల్ల గాదు. మేమియ్య..' అని పంపకాలోల్లు మూటలు ఎనక్కి దాసుకున్నారంట. ఇంకేముండాది. అగ్గిమీద గుగ్గిలమైపొయ్యినారు పక్కింటోల్లు. ప్రచారంలో తిరగతా వుండే ప్రెతిపచ్చమోల్లకు ఆడినింకానే ఫోన్లు కొట్టినారు. 'మీరేం మనుషులప్పా.. ఇక్కడ అదికార పార్టీవోల్లు కాసులు పంచేస్తావుంటే అక్కడ ఎర్రోల్లలా ఉత్తి చేతులతో తిరిగతా వుండారు? రాండి.. రాండి వొచ్చి ఈ కాసుల పంపకాలను ఆడ్డుకోండి' అంటూ కొంపలు మునిగిపోయేటట్టు చెప్పినారంట. ఇదేదో తేడాగా ఉండాదని, ఆ పంపకాల గుంపు నాయకుడు బైపాస్ రోడ్డులోని బాబునగర్‌కు చెందిన తన మనుషులను ఒగ యాపైమందిదాకా పిలిపించేసినాడంట. ఒకేల ప్రెతిపెచ్చమోల్లు గొడవకు దిగితే, తొడగొట్టి బరిలో దూకడానికి తయారైపొయ్యినారంట. మజ్జలో ఓల్ల పార్టీ నాయకులనింకా ఫోన్లు వొచ్చినాయి. 'ఒరేప్పా.. ఇది మన టైం గాదురాప్పా. ప్రెతిపెచ్చమోల్లకు మీరు కాసుల మూటలతో దొరికినారంటే పెంటపెంట చేసేస్తారు. వోల్లొచ్చే లోపల మీరు బిటీన లగెత్తుకోని ఆడినింకా పారిపోండి.' అని ఆ ఫోను కొట్టిన నాయకులు సలహా ఇచ్చినారంట. అంతే.. ప్రెతిపెచ్చమోల్లు వొచ్చేసరికి అక్కడ ఒక్క పిట్ట ఉంటే ఒట్టు. 'గడపదాకా వొచ్చిన కాసులకు మోకాలడ్డినారు గదే. మీ కాపురాలు గూలా?' అంటా మొదటింటోల్లు మెటికలు ఇరస్తావుండారంట. - కుప్పం

● ఇదీ సంగతి

సినిమా షో.. రద్దు



ఎన్నికల ప్రభావం సినిమా థియేటర్ల మీద స్పష్టంగా కనిపిస్తోంది. ప్రేక్షకులులేక గురువారం చిత్తూరు నగరంలోని కొన్ని థియేటర్లలో మార్నింగ్ షోలను రద్దు చేశారు. ఎన్నికలయ్యే వరకు పెద్ద హీరోల సినిమాలను విడుదల చేయకుండా వాయిదా వేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయా థియేటర్లలో చిన్న హీరోల సినిమాలు నడుస్తున్నాయి. పోలింగ్ తేది సమీపిస్తుండటం.. చాలామంది ప్రచారాల్లో బిజీగా ఉండటంతో థియేటర్లకు వచ్చేవారు లేకుండా పోయారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

టీడీపీలోకి వలసల వెల్లువ



టీడీపీలో చేరిన వీరరాఘవ రెడ్డితో సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, మే 9: టీడీపీలోకి వలసలు వెల్లువెత్తాయి. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. శ్రీకాళహస్తి మండలం ముచ్చువోలు గ్రామానికి చెందిన రాష్ట్ర శాఫ్ డైరెక్టర్ వీర రాఘవరెడ్డి తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. రేణిగుంట మండలంలోని యర్రమరెడ్డిపాలెం, వినాయకపురం, తూకివాకం, పన్నీరు కాలువ గ్రామాల నుంచి పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో తూకివాకం ఉపసర్పంచు శ్రీనివాసులు, వార్డు మెంబర్ భరత్ ఉన్నారు. వీరందరికీ సుధీర్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు చిట్టెం శంకరయ్య రిషితా రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మునిరాజు నాయుడు, నాయకులు దశరదాచారి, చెంచయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు. ● అదేవిధంగా తొట్టంబేడు మండలంలోని తాటిపర్తి, వెన్నలపాడు గ్రామాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు ఆధ్వర్యంలో నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు తనయుడు దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని ఆమందూరు పంచాయతీలో గురువారం సాయంత్రం స్థానిక టీడీపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి సుధీర్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుణ యాదవ్, ఊటీ చంద్రశేఖర్‌యాదవ్, రాచేటి సుబ్రహ్మణ్యం, శివ మణి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన చిట్టెం శంకరయ్యతో రిషితా రెడ్డి

బొజ్జల సుధీర్ రెడ్డిని గెలిపించండి
నందమూరి రామకృష్ణ

శ్రీకాళహస్తి, మే 9: శ్రీకాళహస్తి ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుధీర్ రెడ్డిని గెలిపించాలని నందమూరి రామకృష్ణ పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన బొజ్జల సుధీర్‌రెడ్డిని కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో చిన్న మచ్చ లేకుండా, నిత్యం అభివృద్ధి కోసం తపించిన బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తనయుడిని గెలిపించుకోవాలని కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న నందమూరి రామకృష్ణ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హరినాథ్‌రెడ్డి, సుధీర్

టీడీపీ, వైసీపీ నేతల ఘర్షణ
పరస్పరం దాడి ● ఇరువర్గాలపై కేసు

ఏర్పేడు, మే 9: ఏర్పేడు మండలం నచ్చనేరి పంచాయతీ దుర్గిపేరి గ్రామంలో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య బుధవారం రాత్రి చిన్నపాటి వివాదం వచ్చింది. అది కాస్త ముదిరి చిలికిచిలికి గాలివానలా మారింది. దీంతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో టీడీపీకి చెందిన హరినాథ్‌రెడ్డి, మునీంద్ర, వైసీపీకి చెందిన నచ్చనేరి సర్పంచు మునిరామిరెడ్డి కుమారుడు సుధీర్ గాయపడ్డారు. నచ్చనేరి సర్పంచు మునిరామిరెడ్డి తన వర్గీయులతో కలిసి బుధవారం రాత్రి దుర్గిపేరి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ సమయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దపెద్దగా కేకలు పెట్టి టీడీపీ నాయకుల ఇళ్ల ముందుకు వచ్చి ప్రచారం నిర్వహించారు. శబ్దం చేయకుండా ప్రచారం చేసుకోమని వైసీపీ నాయకులకు టీడీపీ నాయకులు చెప్పారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం రేగింది. ఈ క్రమంలో వైసీపీ, టీడీపీ నాయకులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో వైసీపీకి చెందిన సుధీర్, టీడీపీకి చెందిన హరినాథ్‌రెడ్డి గాయపడ్డారు. అంతటితో ఆగకుండా గురువారం ఉదయం మళ్లీ రెండు వర్గాల మధ్య వివాదం చెలరేగింది. టీడీపీ నేత బోడిరెడ్డి కుమారుడు మునీంద్ర పొలాల్లో పనిచేస్తుండగా అక్కడకు వైసీపీ నాయకులు వెళ్లి అతనిపై దాడి చేశారు. దీంతో ఇరువర్గాలు గురువారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు.

వరుస చోరీలతో కలకలం



ఇక్బాల్ ఇంట్లో చిందరవందరగా ఉన్న వస్తువులు

శ్రీకాళహస్తి, మే 9: శ్రీకాళహస్తి పట్టణంలో ఒకేరోజు నాలుగు ఇళ్లలో వరుస చోరీలు కలకలం రేపాయి. శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ నరసింహారావు కథనం మేరకు... పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీ చెందిన ఇక్బాల్ ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తుంటాడు. బుధవారం ఆయన విధులకు వెళ్లిన సమయంలో కుటుంబ సభ్యులు బంధువుల ఇంట శుభకార్యం కోసం ఊరికి వెళ్లారు. బుధవారం రాత్రి దొంగలు ఇంట్లోకి చొరబడి సుమారు 65 గ్రాముల వెండి వస్తువులు, రూ.50 వేల నగదును చోరీ చేశారు. ఆ పక్కనే మరో ప్రైవేటు ఉద్యోగి ఇంట్లో రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఆ తర్వాత సమీపంలోని మరో రెండు ఇళ్లలో చోరీ చేసేందుకు కిటికీలు పగలగొట్టి విఫలయత్నం చేశారు. ఉదయం చోరీలు జరిగినట్లు తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ నరసింహారావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇక్బాల్ భార్య జుబేదా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మిగిలిన బాధితులు ఫిర్యాదు చేసేందుకు నిరాకరించారు. తిరుపతి నుంచి క్లూస్ టీం బృందం వచ్చి ఆధారాలను సేకరించింది. ఇక చోరీ జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాల్లో వచ్చిన ఆరుగురు దొంగలు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఇతర పోలీస్ స్టేషన్లకు వీడియోను పంపి దొంగలు ఎవరన్నది నిర్ధారించేందుకు విచారణ చేస్తున్నారు.

వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పండి



సత్రవాడ ప్రవీణ్‌ను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, మే 9: అరాచక వైసీపీ పాలనకు ప్రజలు ఓటు హక్కుతో బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య కుమారుడు ప్రవీణ్ పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పానగల్ ప్రాంతంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ పాలనలో ప్రజలకు జరిగిన అన్యాయాలను వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్ రెడ్డిని, కమలం గుర్తుపై ఓటు వేసి ఎంపీగా వరప్రసాద్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈసందర్భంగా సత్రవాడ ప్రవీణ్‌ను స్థానిక నేతలు సత్కరించారు. కార్యక్రమంలో కంటా రమేష్, మునిశేఖర్ గౌడ్, జై కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన



సమావేశంలో ప్రసంగిస్తున్న సైకాలజిస్టు మురళి

ఏర్పేడు, మే 9: ఏర్పేడు మండలం నాగంపల్లి వద్ద ఉన్న ఎస్వీఎస్ ఎఫ్ఎస్పీ ఆధ్వర్యంలో లైఫ్ స్కిల్స్ ట్రైనింగ్ గురువారం నిర్వహించారు. ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల నుంచి వంద మంది విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా ఇంపాక్ట్ లైఫ్ స్కిల్స్ కోచ్ మెంబర్, సైకలాజిస్టు గుండ్లపల్లి మురళి పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై మాట్లాడారు. జీవన నైపుణ్యాల గురించి లక్ష్యం ఏ విధంగా ఎంచుకోవాలి... లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఎలాంటి శక్తిసామర్థ్యాలు కలిగి ఉండాలనే దానిపై వివరించారు. జీవితంలో ఉన్నతంగా ఎదగాలంటే ఎలాంటి స్కిల్స్ అవసరమో తెలియజేశారు. తల్లిదండ్రులను గౌరవించడం, నైతిక విలువలను పెంపొందించుకోవడం, ఇంటర్ పర్సనల్ రిలేషన్స్‌షిప్ ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్పీ లోకేషన్ ఇన్‌ఛార్జి సత్యనారాయణ, సిబ్బంది జీనత్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలనకు చరమగీతం పాడండి: ఆదిమూలం



నారాయణవనంలో ప్రచారం నిర్వహిస్తున్న ఆదిమూలం

నారాయణవనం, మే 9: రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడాలని ఎన్డీఏ కూటమి సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం అన్నారు. గురువారం నారాయణవనం మండలంలోని పాలమంగళం, తుంబూరు, నైనారు కండ్రిగ, అరణ్యంకండ్రిగ, వెత్తల తడుకు, బొప్పరాజపాలెం భీముని చెరువు, కళిమిట్ట, బ్రాహ్మణ తాంగెల్, మండల కేంద్రంలోని 1, 2 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటిక వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆదిమూలం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, అవినీతి, అక్రమాలతో చెలరేగిన వైసీపీకి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గిరిబాబు, నాయకులు ఆర్‌డీ ఏకాంబరం, బాస్కరన్, గోవిందస్వామి, షణ్ముగం, దానా పరుశురామయ్య, విజయ్‌కుమార్, వేలు రెడ్డి, పయణి, కేఎస్ రవి, మాణిక్యం రెడ్డి, భక్తవత్సలం, కందస్వామినాయుడు, విజయకుమార్, శ్రీనివాసులు, బాలచంద్రనాయుడు, జయచంద్రనాయుడు, గోవిందస్వామి, ఊరప్ప, దొరవేలు రెడ్డి, నరేష్, ప్రసన్న, సుబ్రహ్మణ్యం, రఘపతి రెడ్డి, కోదండం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం: వరప్రసాద్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వెలగపల్లి వరప్రసాద్‌రావు - తిరుపతిలో ప్రచారం నిర్వహిస్తున్న కొల్లూరి లక్ష్మి, స్ఫూర్తి తదితరులు

తిరుపతి, (ఉపాధ్యాయనగర్) మే 9: బీజేపీ అవలంబిస్తున్న విధానంతోనే దేశం సుస్థిర భారతదేశంగా అవతరిస్తోందని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు అన్నారు. గురువారం ఓ ప్రైవేట్ హోటల్‌లో గాండ్ల కుల మనః కలయిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వరప్రసాద రావు మాట్లాడుతూ... ఎన్డీఏ కూటమికి బీసీలే వెన్నముకలాంటివారని కొనియాడారు. వైసీపీ ప్రభు త్వం కులాల వారీగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందేగానీ వాటి అభి వృద్ధికి నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేసిందని ధ్వజమెత్తారు. అరాచకం, అప్పులే జగన్ ప్రభుత్వ వైఖరిగా మారిందని కనీసం ఎటువంటి అభివృద్ధి జరగలేదని వాపోయారు. ఇటువంటి ప్రభుత్వం మనకు అవసరమా అని ప్రశ్నించారు. గతంలో తాను ఎంపీగా పని చేసినప్పుడు అభివృద్ధికి బీజేపీ సహకారం అందించిందని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వానికి బుద్ధిచెప్పేలా ఎన్డీఏ కూటమికి ఓట్లువేసి గెలిపిం చాలని కోరారు. తాను ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో గాండ్లకుల నాయకులతోపాటు బీజేపీ నాయకులు విష్ణుకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో విస్తృతంగా ప్రచారం...

తిరుపతిలో బీజేపీ తరఫున విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు జరిగాయి.ఇందిరానగర్, టౌన్‌క్లబ్, ఐఎస్‌మహల్‌రోడ్డు, బైరాగిపట్టెడ, ఎస్టీవీ నగర్, ఎయిర్ బైపాస్‌రోడ్డు, అంబేడ్కర్ కాలనీల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ప్రచారంలో తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు సతీమణి కొల్లూరి లక్ష్మి, కుమార్తె డాక్టర్ స్ఫూర్తి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి బీజేపీ, టీడీపీ, జనసేన అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలంటూ అభ్యర్థించారు. ప్రచారం చేస్తున్న తమను స్థానికులు ఎంతో ప్రేమాభిమానాలతో ఆదరిస్తున్నారని వారి ఆదరాభిమానాలు చూస్తుంటే తమ విజయం ఖాయమని అనిపిస్తుందని వారు అన్నారు.

ఎన్డీఏ ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి: పల్లమాల సుధాకర్

శ్రీకాళహస్తి, మే 9: ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మొగలిరేకులు సీరియల్ నిర్మాత, టీడీపీ నాయకుడు పల్లమాల సుధాకర్ పిలుపునిచ్చారు. ఉమ్మడి అభ్యర్థుల గెలుపు కోసం ఆయన టీడీపీ నాయకులతో కలిసి పాపానాయుడు పేట, వికృతమాల, కందాడు, శ్రీకాళహస్తి మండలంలోని ముచ్చువోలు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. ముఖ్యంగా శ్రీకాళహస్తిలో అభివృద్ధి అటకెక్కి అరాచక పర్వం సాగిందన్నారు. అభివృద్ధి ప్రదాతగా నిలిచిన మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తనయుడు సుధీర్ రెడ్డిని గెలిపించుకుకోవాలని విజ్ఞప్తి చేశారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా సుధీర్ రెడ్డిని, కమలం గుర్తుపై ఓటు వేసి ఎంపీగా వరప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పల్లమాల శశాంక్ తదితరులు పాల్గొన్నారు.



పాపానాయుడుపేటలో ప్రచారం చేస్తున్న పల్లమాల సుధాకర్

కోర్టులో ఉంటే మాకేం..!

● 6.78 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా
● ప్లాట్లు వేసి విక్రయించేందుకు యత్నం



కమ్యూనిటీ భవనాన్ని వదిలిపెట్టి మిగిలిన ప్రభుత్వ భూమికి ప్రహరీ నిర్మించిన దృశ్యం

రేణిగుంట, మే 9: నిన్న మొన్నటి వరకు కాలువలు, చెరులువులు, ప్రభుత్వ భూములను కబ్జాలు చేశారు. అవేవీ చాలవన్నట్లు ఏకంగా కోర్టు వివాదంలో ఉన్న ప్రభుత్వ భూమిని చదును చేశారు. దానికి ప్రహరీ నిర్మించి ప్లాట్లు వేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 758/4డీఈలో ఇద్దరికి ఒకటిన్నర ఎకరా చొప్పున అప్పట్లో ప్రభుత్వం వ్యవసాయం చేసుకునేందుకు కేటాయించింది. ఈ సర్వే నెంబరుకు ఆనుకొని పొరంబోకు భూమి 3.78 ఎకరాలు ఉంది. దీని పక్కనే ప్రైవేటు వెంచరు ఉండటంతో ఈ ప్రాంతంలో ఎకరా విలువ రూ.4కోట్లు పలుకుతోంది. గతంలో ఇదే భూమిని చదును చేసి విక్రయించేందుకు ప్రయత్నించగా అప్పటి తహసీల్దారు అడ్డుకున్నారు. ఆ భూమిలో వ్యవసాయం చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని డీకేటీ పట్టాదారులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఈ భూమిపై స్టేటస్ కో ఇచ్చింది. ఇది ప్రభుత్వానికి చెందుతుందని అప్పటి తహసీల్దారు అపీల్ చేశారు. ఇదిలా ఉండగా వైసీపీకి చెందిన ఓ న్యాయ సలహాదారుడు రంగంలోకి దిగి డీకేడీ పట్టా ఉన్న మూడు ఎకరాలతో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ పొరంబోకు భూమి 3.78ఎకరాలను కలుపుకుని 6.78 ఎకరాల భూమిని చదును చేశారు. ఈ సర్వే నెంబరులోనే ప్రభుత్వ కమ్యూనిటీ భవనాన్ని మినహాయించి మిగిలిన భూమికి ప్రహరీ నిర్మించారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులకు పట్టించుకోలేదు. కలెక్టర్ స్పందించి కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని రక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ముగిసిన చిన్నారుల పండరి భజన శిక్షణ

పిచ్చాటూరు, మే 9: పిచ్చాటూరులోని ద్రౌపదమ్మ ఆలయం వద్ద 101 రోజులుగా నిర్వహించిన చిన్నారుల పండరి భజన శిక్షణ గురువారం ముగిసింది. చిన్నారులు, వారి తల్లిదండ్రులు కలసి భజన నేర్పిన గురువులు లోకేష్, శివకుమార్, తులసి, శ్రీవాణిలను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఎక్కడైనా చిన్నారుల పండరి భజన కార్యక్రమం జరపాలనుకునే వారు ఎం.మణికంఠన్ మొబైల్ నెం.9014037894ను సంప్రదించాలని పిచ్చాటూరు ద్రౌపదమ్మ భజన బృందం సభ్యులు కోరారు.

మరమగ్గాలకు పూర్వ వైభవం తీసుకొస్తా: భానుప్రకాష్



నగరి కొత్తపేటలో ప్రచారం చేస్తున్న భానుప్రకాష్ - టీడీపీలో చేరిన వారితో

నగరి, మే 9: మరమగ్గ కార్మికులకు పూర్వ వైభవాన్ని తీసుకొస్తానని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి పట్టణంలోని కొత్తపేటలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో తయారైన వస్త్రాలకు గతంలో ఎంత గిరాకీ వుండేదో ఆ సదుపాయాన్ని కల్పించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్డీఏ అధికారంలోకి రాగానే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీని గెలిపించాలని కోరారు.

వడమాలపేట: మండలంలోని పాదిరేడు, కాయం గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు సురేష్, గంగయ్య, మునికృష్ణ, వెంకట్రామ నాయుడు, వినోద్, సుధాకర్, మణి, గోపీ, బాబురెడ్డి, దేవ, నీల, ప్రసాద్, హేమ తదితరులు టీడీపీలో చేరారు. వారికి గాలి భానుప్రకాష్ కండువాలు కప్పి ఆహ్వానించారు.

వైసీపీ కార్యాలయం సీజ్



వైసీపీ కార్యాలయాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

రేణిగుంట, మే 9: రేణిగుంట పట్టణంలోని వైసీపీ కార్యాలయాన్ని ఎన్నికల అధికారులు గురువారం మధ్యాహ్నం సీజ్ చేశారు. పోలింగ్ బూత్‌కు 200 మీటర్ల వరకు రాజకీయ పార్టీల కార్యాలయాలు ఉండకూడదు. పట్టణంలోని ఉన్నత బాలికల పాఠశాల పోలింగ్ బూత్‌కు వంద మీటర్ల దూరంలో వైసీపీ కార్యాలయం ఉండటంతో మరోచోటుకు తరలించాలని అధికారులు నోటీసులు అందజేశారు. స్పందించకపోవడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి సలోని, ఎంపీడీవో విష్ణుచిరంజీవి సిబ్బందితో కలిసి వైసీపీ కార్యాలయానికి చేరుకుని సీజ్ చేశారు. కాగా, బుధవారం అర్ధరాత్రి పాంచాలినగర్‌లో ఓటర్లకు ఓ వ్యక్తి డబ్బులు ఇస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద రూ.2లక్షలు స్వాధీనం చేసుకున్నారు. రేణిగుంట పోలీసులకు అప్పగించగా సీఐ మల్లికార్జున్‌రెడ్డి కేసు నమోదు చేశారు. నిందితుడికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, మే 9: ముక్కంటి ఆలయంలో వెలసిన గురుదక్షిణామూర్తి స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు గురుదక్షిణామూర్తి సన్నిధిని శుద్ధి చేశారు. శాస్త్రోక్తంగా కలసస్థాపన చేసి భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వర్ణకవచాలంకృతంగా అలంకరించారు. పసుపు వర్ణ పూలు, ముడి శెనగల దండలను భక్తులు సమర్పించారు. వేదమంత్రాలు మధ్య ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా కుమార్ నాయుడు



శ్రీకాళహస్తి, మే 9: శ్రీకాళహస్తికి చెందిన కుమార్ నాయుడు బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా కుమార్ నాయుడు నియమితులయ్యారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

పిచ్చాటూరు, మే 9: పిచ్చాటూరు మండలం నీరువాయి గ్రామంలో సత్యవేడు నియోజకవర్గ ఎస్సీసెల్ కార్యదర్శి ఎస్వీ నాగరాజు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ మేనిఫెస్టోను వివరించారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్నా, బడుగు బలహీన వర్గాలు ప్రగతి బాటలో నడవాలంటే సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఆదిమూలంను ఎమ్మెల్యేగా, కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి వరప్రసాద్‌ని ఎంపీగా గెలిపించుకోవాలని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన అధ్యక్షుడు సుగంధర్, రాజ్ కుమార్, ఎస్.మణి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారాల జోరు

కేవీబీపురం, మే 9: మండలంలో గురువారం వివిధ పార్టీలు ప్రచారం ముమ్మరంగా సాగించాయి. టీడీపీ మండలాధ్యక్షుడు రామాంజులనాయుడు, మునస్వామియాదవ్, గోపిరెడ్డి ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా బీజేపీ మండలాధ్యక్షుడు మునిశేఖర్ ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.